# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక






అమలాపురం | సంపుటి : 10 సంచిక : 24 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | ఆదివారం 16 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 24 16-03-2025 Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-


# అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలనే లక్ష్యం

- గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. పరదాలు కట్టుకుని తిరిగారు.
- సుస్థిరమైన ప్రభుత్వంతోనే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.
- కేంద్రం అందిస్తున్న ఆర్థిక సాయంతో రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చేస్తాం.
- తణుకులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు.
- ఎన్టీఆర్ పార్కులో మున్సిపల్ కార్మికులతో కలిసి చెత్తను ఊడ్చి పరిశుభ్రం చేసిన ముఖ్యమంత్రి.



తణుకు మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి. ఇళ్లతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. రూ. 10 లక్షల కోట్ల అప్పుభారం ప్రజలపై మోపారు. రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని, ప్రజల సహకారంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.**

**ఇది ప్రజా ప్రభుత్వం :**

1978, మార్చి 15వ తేదీ ... 45 ఏళ్ల క్రితం ఇదే రోజు నేను మొదటి సారి అసెంబ్లీలో అడుగుపెట్టాను. ఈ రాష్ట్రంలో ఎవరికీ దక్కని అసాధారణ గౌరవం నాకు దక్కింది. తెలుగు ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం. పాలనలో సంస్కరణలు తెస్తున్నాం. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికను ప్రజలు ఆశీర్వదించారు. కేంద్ర సహకారంతో రాష్ట్రం అభివృద్ధి బాట పట్టింది. స్వర్ణాంధ్ర 2047 పేరుతో ఒక స్పష్టమైన విధానం తీసుకొచ్చాం. గత పాలకులు ఏనాడైనా ప్రజల్లో తిరిగారా ? పరదాలు కట్టుకుని తిరిగారు. గాల్లో వస్తుంటే నేలపై చెట్లు నరికించారు. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితులు లేకుండా చేశారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేసి రూ. 10 కోట్ల అప్పులు ప్రజలపై మోపారు. అసలు , వడ్డీ కడుతున్నాం. గత పాలకులు చెత్తపైనా పన్ను వేశారు. మీ పట్టాదారు పుస్తకాలపై వారి బొమ్మలు వేశారు. రాజముద్రతో పట్టాదారు పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి లక్షల భూములు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రైవేటు భూములు 22 ఏ కింద పెట్టేశారు. తప్పులు చేసి కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ ముసుగులో ఎదురుదాడి చేస్తున్నారు. స్థిరమైన ప్రభుత్వంతోనే సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. మన దేశంలో ఒక్క పెన్షన్ల కిందే ప్రతి నెలా 64 లక్షల మందికి ఏడాదికి రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తోంది ఏపీ ప్రభుత్వమే. గత ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ పింఛన్లు ఇచ్చారు. రూ. 200 పింఛన్ని రూ. 2 వేలు చేసింది నేనే. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 3,000 పింఛను రూ.4000 వేలు చేశాను. డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమ్కెన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నాం. మే నెల నుంచి ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం అందిస్తున్నాం. ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ తెచ్చాం. దేశంలో ఎక్కడా లేని విధంగా మధ్యతరగతి కుటుంబాలకు బీమా కల్పిస్తున్నాం. రైతు భరోసా కింద రూ. 20 వేలు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నాం. గత ఐదేళ్లలో ఎక్కడ చూసినా గుంతలే. నూటికి 85 శాతం రోడ్లలో గుంతలు లేకుండా చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదే. గతంలో 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా నేను చేసిన పనుల వల్ల దేశంలో అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గత ఐదేళ్లూ అభివృద్ధి అన్న మాట లేకపోవడంతో దక్షణ భారతదేశంలో తక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా ఏపీ నిలిచింది.



**స్వచ్ఛాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలి**

గత పాలకుడు ఐదేళ్లలో కనీసం మట్టి కూడా తీయలేదు. 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మనకు వారసత్వంగా ఇచ్చారు. స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమం చేయాలి. తణుకులో కూరగాయల మార్కెట్ చూశాను. మిగిలిన

- తరువాయి 2లో..



## 1550 కోట్లతో ఆంధ్రాలో
# జాతీయ రహదారులు

### ఏపీలో వేగవంతం అవుతున్న నేషనల్ హైవే 516(ఈ) నిర్మాణం

అమరావతి మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగం పెరిగింది. ముఖ్యంగా కోస్తా %-% ఉత్తరాంధ్రను కనెక్ట్ చేసే 516(ఈ) నేషనల్ హైవే నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ హైవే రాజమహేంద్రవరం నుంచి మన్యం మీదుగా విజయనగరం వరకు విస్తరించనుంది. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ హైవే పనులు చివరి దశకు చేరుకున్నాయి.



**నేషనల్ హైవే 516(ఈ) ప్రయోజనాలు**

కనెక్టివిటీ పెరుగుతుంది %-% ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాలకు మధ్య ప్రయాణం వేగవంతమవుతుంది. ప్రయాణ సమయం తగ్గుతుంది %-% కొయ్యూరు నుంచి కృష్ణదేవిపేట వెళ్లడానికి పూర్వం గంట సమయం పట్టేది, ఇప్పుడు 30 నిమిషాల్లో చేరుకోవచ్చు. మంచి రహదారులు %-% ఇరుకు మలుపులు, ప్రమాదకర ఘాట్ రోడ్లు ఇప్పుడు విశాలంగా మారాయి. ఆర్థిక అభివృద్ధికి బూస్ట్ %-% రవాణా సౌకర్యం మెరుగుపడటంతో వ్యాపారం, పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. సురక్షిత ప్రయాణం %-% కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జిలు, టోల్ గేట్లు, బైపాస్ రోడ్లు

- తరువాయి 2లో..

# ఏపీని నెంబర్‌వన్ చేయడమే నాలక్ష్యం : చంద్రబాబు



తణుకు మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తణుకు - చివరి రక్తపు బొట్టు వరకు ప్రజలకు సేవ చేస్తానని, రాబోయే 22 ఏళ్లలో ఏపీని దేశంలో నెంబర్ వన్‌గా చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు లో నేడు జరిగిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడారు.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా పరిసరాల శుభ్రత కోసం వారు చేస్తున్న కృషిని అభినందించారు.. వారందరితో కలసి ఫోటో దిగారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర తన జీవిత లక్ష్యమని చెప్పారు. ప్రజారోగ్యం కోసమే స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రజలంతా ఈ కార్యక్రమానికి

- తరువాయి 2లో..



# ఏపీ ప్రభుత్వం వినూత్న కార్యక్రమం..
## ఎంపీలు, ఎమ్మెల్యేలకు అవార్డులు!




అమరావతి మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రజలకు ఎంపీలు, ఎమ్మెల్యేలను మరింత చేరువ చేసేందుకు ఏపీలోని కూటమి ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎవరైతే ప్రజా సమస్యలు తెలుసుకుని వారి కోసం అసెంబ్లీలో, పార్లమెంట్‌లో పోరాటం చేస్తారో వారికి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. పార్టీలకు అతీతంగా ఈ అవార్డుల ప్రదానం ఉంటుందని తెలిపింది. ఏ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అయినా సరే ప్రజల వద్దకు వెళ్లాలని కోరింది. ఇలా ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజలకు మరింత దగ్గరవుతారని, ప్రజల సమస్యలను అసెంబ్లీ, పార్లమెంట్‌కు వినిపిస్తారని భావిస్తోంది.ఏపీ ప్రభుత్వం వినూత్న కార్యక్రమం విజేతల ఎంపిక కోసం ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ఇందులో భాగంగా సభలో సభ్యుల పనితీరు, వారి ప్రవర్తనను పరిగణలోకి తీసుకుని అవార్డు అందజేయనుందని తెలుస్తోంది. కాగా, విజేతల ఎంపిక కోసం ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఎంపిక చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు అవార్డులు అందిస్తారని సమాచారం. ఇక ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పితే 'ఉత్తమ లెజిస్లేచర్', అదే పార్లమెంట్లో అయితే 'ఉత్తమ పార్లమెంటేరియన్' తరహాలో అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

**మరిన్ని ప్రజా సేవలపై దృష్టి**

ఈ అవార్డుల కార్యక్రమం మార్చి నెలాఖరులో జరిగే అవకాశముంది. ప్రభుత్వ ప్రధాన కార్యాలయంలో

- తరువాయి 2లో..


# రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు

అమరావతి మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. మరీ ముఖ్యంగా.. దక్షిణ తెలంగాణతో పోలిస్తే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. వచ్చే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణం కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఎండ తీవ్రతతోపాటు వడగాలుల ప్రభావం కూడా ఉంది. ఈరోజు ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నందున 7 జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్‌లో 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

**పెరిగిన ఉష్ణోగ్రతలు తెలంగాణలో ఆరెంజ్**
**కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు**

ఏపీలోనూ ఎండలు ఠారెత్తిస్తున్నాయి. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40



డిగ్రీలు దాటాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉష్ణోగ్రతలు మరింత పెరిగినట్లుగా వాతావరణ కేంద్రం తెలిపింది. పల్నాడు జిల్లాలోని రెంటచింతలలో 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రెంటచింతల ప్రాంతంలో సాధారణంగా మార్చి నెలలో 35 డిగ్రీల వరకు ఎండ ఉంటుంది. ఈసారి మాత్రం మార్చి మధ్యలోనే

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం
దినపత్రిక

# సంపాదకీయం

## ‘ఇండియా’ కూటమి లేనట్టేనా?

సీపీఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ఈ నెల 9వ తేదీన గమనార్హమైన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం యేచూరి మరణం తర్వాత ఇంకా ఎవరూ ఆ స్థానంలోకి రాలేదు. కరత్ పొలిట్ బ్యూరో సమన్వయ కర్తగా నియమితులయ్యారు. అది ప్రస్తుతా నికి ప్రధాన కార్యదర్శి వంటి హోదా. పైగా ఆయన స్వయంగా లోగడ ఆ హోదాలో పని చేశారు. అందువల్ల తన మాటలకు తగినంత ప్రాధాన్యత ఉంటుంది. అంతేకాదు. కరత్‌కు మార్క్సిస్ట్ సిద్ధాంతాలలో నిష్ణాతుడనే పేరు పార్టీలో, బయటా కూడా ఉన్నది. హరికిషన్ సింగ్ సూర్జిత్ ప్రధాన కార్యదర్శిగా ఉండినపుడు, సీపీఎంతో పాటు మొత్తం వామపక్షాలను మధ్యే మార్గ పార్టీలతో మైత్రి వైపు మళ్లించారు. సీతారాం అందుకు అనుకూలురు కాగా, కరత్ వ్యతిరేకి.

కరత్ మాట్లాడిన సందర్భం సీపీఎం కేరళ శాఖ సభలు కొల్లామ్ పట్టణంలో జరగటం. ఆ సభలు ఒక రాష్ట్రానికి సంబంధించినవి. ఆయన మాటలు నేరుగా తన ప్రసంగంలో అన్నవి గాక, విడిగా ఒక పత్రికా ప్రతినిధితో చెప్పినవి. అందువల్ల వాటికి తగిన ప్రచారం రాలేదు. కానీ అవి మొదట అనుకున్నట్లు గమనార్హమైనవి: ‘ఇండి యన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరిట ఏర్పడిన 26 బీజేపీ యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే.

ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధా నాలు, సిద్ధాంతాలు, నాయకులు ఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. ఒక సమన్వయ కమిటీ ఏర్పాటుకు ఇతర పార్టీలు ప్రయత్నించాయి గానీ అది ఆచరణలో పని చేయగలది కాదన్నాము. దానితో, నాయకులు మాత్రం కలుస్తుండేవారు. కొన్ని కమిటీలు ఏర్పాటు చేశారు గానీ అవేవీ పని చేయ లేదు.

సీట్ల సర్దుబాటుపై జాతీయ స్థాయి చర్చలు వీలయేవి కాదు గనుక ఆ పని ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంగా జరగాలన్నాము మేము. ఉదాహరణకు మా పార్టీ బెంగాల్‌లో, కేరళలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయదు. మొత్తానికి ఆ పద్ధతి పనిచేసి బీజేపీ సొంత మెజారిటీ కోల్పోయి 240 స్థానాలకు తగ్గింది. అందువల్ల, ఇండియా కూటమి అన్న ఆలోచనే లోక్‌సభ ఎన్నికలకు పరిమితమైనటువంటిది... లోక్ సభ ఎన్నికల అనంతరం తమకు అసలు ఒక ఉమ్మడి వేదిక అవస రమా? అయితే ఏ విధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి. ఒక వేళ వేదిక ఎన్నికల కోసమే అయితే, ఇపుడు చేయవలసింది ఏమీఉండదు’ అన్నారు సీపీఎం సమన్వయకర్త.

### కూటమి భవిష్యత్తు?

కరత్ వెల్లడించిన అభిప్రాయాలలో ఇండియా కూటమి ఏవిధంగా వ్యవహరించిందన్న గత పరిస్థితులకే పరిమితమయ్యారనే భావన కలగవచ్చు. కానీ అందులో అంతర్లీనంగా, ప్రతిపక్షాలు మౌలి కంగా ఎట్లా పనిచేస్తున్నాయి, భవిష్యత్తులో ఏ విధంగా పని చేయా లనే కోణాలు కూడా కనిపిస్తాయి. చెప్పాలంటే ఈ ప్రశ్నలు ప్రతి పక్షాలకు 1977 నాటి జనతా పార్టీ నుంచి మొదలుకొని తర్వాత కాలంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల కాలంలో, ఇంకా తర్వాత కాంగ్రెస్ నాయకత్వాన ఏర్పడిన యూపీఏ హయాంలోనూ కొనసాగినవే. ఇండియా కూటమి బలహీనతలు, వైఫల్యాల వెనుక కూడా ఇదంతా ఉంది.

కూటమికి వ్యవస్థాత్మక నిర్మాణాన్ని సీపీఎం వ్యతిరేకించటానికి కారణం అందులో పలు రకాల విధానాలు, సిద్ధాంతాలు గల పార్టీలు, నాయకులు ఉండటం. దీనికి సమాధానాలు కనుగొనలేకపోయినందువల్లనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి కూటమికి భంగపాట్లు ఎదురు కావటం జరిగింది. అటువంటి భంగపాట్లు జనతా పార్టీ కాలం నుంచి గత 48 సంవత్సరాలుగా ప్రతిపక్షాలకు ఎదురవుతూనే ఉన్నాయి. అందుకు ఒక కారణం వారి వైఫల్యాలు కాగా, మరొకటి భారతదేశపు మహా విస్తారమైన వైవిధ్యత.

ఇన్నిన్ని ప్రాంతాలు, సైద్ధాంతిక, విధానపర, రాజకీయ వైవిధ్య తలు ఉన్నపుడు ఏకాభిప్రాయాలు, విభేదాలకు అవకాశం ఉండని సమష్టి నాయకత్వాలు తేలిక కాదు. కాంగ్రెస్, బీజేపీలవలె నిర్దిష్ట దీర్ఘకాలిక చరిత్రలు, నాయకత్వాలు, సిద్ధాంతాలు ఉన్నపుడు అది సాధ్యమవుతుంది. లేదా ఎమర్జెన్సీ వంటి అసాధారణ పరిస్థితి ఏర్పడి దేశాన్ని ఒకటి చేయటం వంటిది జరగాలి. వీటన్నింటి మధ్య స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఒక పాయగా సాగుతుండిన సోషలిస్టు రాజకీయం సరిగా కుదురుకొని ఉంటే ఏమి జరిగేదో గానీ పలు కారణాలవల్ల అది ఛిన్నాభిన్నమైంది.

మరొకవైపు, కేవలం ఎమర్జెన్సీ పట్ల వ్యతిరేకతతో ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట ఏర్పడిన జనతా పార్టీ, తర్వాత ‘యాంటీ కాంగ్రెసిజం’ ఆలోచనలతో ముందుకు వచ్చింది. తాము ఒకప్పటి కాంగ్రెస్ సంప్రదాయంలో వామపక్షపు మొగ్గ గల మధ్యే మార్గ ప్రత్యామ్నాయం కాగలమన్న ఫ్రంట్ కూటములు అదే దశలో చెదిరిపోయాయి.

### కనీస ఉమ్మడి కార్యక్రమం ఏమిటి?

అయితే, ప్రకాశ్ కరత్ మాటలను పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే, 1977 నాటి జనతా పార్టీ కాదుగానీ, 1989లో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ కొంత భిన్నంగా కనిపించింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన తీవ్ర అవినీతి ఆరోపణలతో అదే పార్టీకి చెందిన వీపీ సింగ్ వంటి ముఖ్య నేతలు బయటకు రావటం, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించి వేస్తున్నదనే ఫిర్యాదుతో పలు ప్రాంతీయ పార్టీలు, ప్రభుత్వాలు, ఎమర్జెన్సీ %-% జనతా పార్టీ దశలో ఒకటై తిరిగి చెదిరిపోయిన సోషలిస్టు వర్గాలు, ఉభయ కమ్యూ నిస్టులు, దేశవ్యాప్తంగా సమాజంలోని ప్రజాస్వామికవాదులు ఒకే వేదికపైకి వచ్చి చేరారు.

అంతేగాక, వీపీ సింగ్, ఎన్టీఆర్‌ల నాయ కత్వాన బీజేపీని ఒక అడుగు దూరంలోనే ఉంచివేశారు. ఈ వైవిధ్య తల మధ్య అపుడు ప్రకాశ్ కరత్ ఉద్దేశిస్తున్నది ఒకటి జరిగింది. అది, ఎన్నికలకన్నా ముందే వివిధ పార్టీల మధ్య సుదీర్ఘ చర్చల ద్వారా ‘కనీస ఉమ్మడి కార్యక్రమం’ ఒకటి రూపొందించటం. అది దేశ ప్రజానీకానికి ఒక కొత్త విశ్వాసాన్ని కలిగించిన మాట నిజం.

అయితే కొందరు సీనియర్ల అధికార కాంక్షలు, మందిర్%-%మండల్ వివాదాల మూలంగా ఆ ప్రయోగం భంగపడటం తెలిసిందే. అది జరగనట్ల యితే దేశ రాజకీయాలు మరొక విధంగా ఉండేవేమో.సీపీఎం సమన్వయ కర్త ప్రకాశ్ కరత్ అపుడంతా జాతీయ స్థాయిలో ఈ పరిణామాలను ప్రత్యక్షంగా గమనించిన వ్యక్తి. ప్రస్తుత ‘ఇండియా’ కూటమికి సంబంధించిన పరిణామాల వరకు తనకు తెలియనిది లేదు. అందువల్లనే ఆ కూటమి ఏర్పాటు తీరు, లక్ష్యాలు, పనితీరు, పరిమితులు, సాఫల్య వైఫల్యాల గురించి అంత స్పష్టంగా చెప్పగలిగారు.

ఈ విషయాన్ని కొంత ముందుకు తీసుకువెళ్ళి నట్లయితే, ఆయన ఎత్తి చూపిన సైద్ధాంతిక, విధానపరమైన వైవిధ్యతలు, వైరుధ్యాల నుంచి, నాయకుల వ్యక్తిగత ధోరణులనుంచి బీజేపీ యేతర పార్టీలు బయటకు రాగలగటం, నేషనల్‌ఫ్రంట్ వలె కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించుకోవటం ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్న. అందుకు బీజేపీ వ్యతిరేకత అన్నదొక్కటే చాలదు. తమవైపు నుంచి ప్రజలకు చూపించే ప్రత్యామ్నాయ పాజిటివ్ ఆర్థిక, సామాజిక, అభివృద్ధి అజెండా తప్పనిసరి. ఎన్నికల తర్వాత ఏమిటన్న చర్చ ‘ఇండియా’ కూటమిలో ఎప్పుడూ జరగలేదని కరత్ ఎత్తిచూపింది ఈ విధమైన కొరతనే!

‘ఇండియా’ పేరిట ఏర్పడిన 26 బీజేపీ యేతర పార్టీల కూటమి 2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఏర్పడింది మాత్రమే. ఆ ఎన్నికల తర్వాత ఏమి చేయాలన్నది ఎవరూ ఆలోచించలేదు. ఆ కూటమికి ఒక వ్యవస్థాత్మక నిర్మాణాన్ని మేము వ్యతిరేకించాం. ఎందుకంటే రకరకాల విధానాలు, సిద్ధాంతాలు, నాయకులుఆ కూటమిలో ఉన్న స్థితిలో ఏకీకృత కేంద్ర స్థాయి నిర్మాణం సాధ్యం కాదు. లోక్‌సభ ఎన్నికల అనంతరంతమకుఅసలు ఒక ఉమ్మడి వేదిక అవసరమా? అయితే ఏవిధంగా? అన్నది ఈ పార్టీలు ఆలోచించాలి.

## పారిశుద్ధ్యం, స్వచ్ఛత పట్ల ప్రజల్లో మార్పు రావాలి : మంత్రి నారా లోకేష్

అమరావతి మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు మంగళగిరి నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్ సమీపంలోని ఎకో పార్క్ లో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గన్నారు. పార్క్ లో చెత్తను శుభ్రంచేసి స్వయంగా చెత్తకుండీలో వేశారు.



**పారిశుద్ధ్య కార్మికుడితో మంత్రి ముఖాముఖి..**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికుడు ఎమ్.నాగార్జునతో మంత్రి లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. అతని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఊరు, ఎక్కడ పనిచేస్తున్నారని మంత్రి ప్రశ్నించగా.. తాను మంగళగిరి 16వ వార్డులో నివాసం ఉంటున్నానని, 15 ఏళ్ల నుంచి పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాని అతడు తెలిపాడు. ఎంతమంది పిల్లలు, ఎక్కడ చదువుతున్నారని అడగగా%ొ% తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని.. అమ్మాయి పదో తరగతి, అబ్బాయి తొమ్మిదో తరగతి చదువుతున్నారని, ఇద్దరినీ ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలో చదివిస్తున్నానని చెప్పాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువు బాగుందని, మధ్యాహ్న భోజనం కూడా బాగా పెడుతున్నారని చెప్పాడు. మంత్రి స్పందిస్తూ.. ప్రభుత్వ పాఠశాలలను ఇంకా మెరుగుపర్చాల్సి ఉందని, మధ్యాహ్న భోజన పథకంలో మెనూ కూడా మార్చామని ఈ సందర్భంగా చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన సామాగ్రి ఏవిధంగా ఉందని, చెత్తకుండీలు ఉన్నాయా అని అడగగా.. చేతికి వేసుకునే గ్లోవ్స్ మరింత మందంగా ఉండాలని సూచించాడు. ఎకో పార్క్ లో ఇంకా ఏమేం చేస్తే బాగుంటుందని మంత్రి అడగగా.. ప్రతి ఆదివారం పిల్లలు పెద్దఎత్తున పార్క్ కు వస్తున్నారని, వాకర్స్ ఆనందంగా ఉన్నారని సమాధానం ఇచ్చాడు. పిల్లలు బాగా చదవాలని, వారు ఎదిగేలోగా మంగళగిరి బాగా అభివఅద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు.

**స్వచ్ఛత పట్ల ప్రజల్లో మార్పు తీసుకురావాలి**

పారిశుద్ధ కార్మికులు ప్రజలంతా నిద్రకు ఉపక్రమించి తర్వాత వారు మేల్కని పరిసరాలను పరిశుభ్రంగా మారుస్తారని మంత్రి ప్రశంసించారు. మంగళగిని పరిశుభ్రంగా మార్చారని కొనియాడారు. మంగళగిరి ఎకో పార్క్ బాగుందని, మరింతగా అభివఅద్ధి చేస్తామని చెప్పారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత పట్ల ప్రజల్లో మార్పు రావాలి. అందుకే కూటమి ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. స్వచ్ఛతలో మంగళగిరిని ఆదర్శ కార్పోరేషన్ గా తీర్చిదిద్దుతాం. అందుకు కావాల్సిన చర్యలు చేపడతాం. ప్రజలకు కూడా బాధ్యత పెడితే పారిశుద్ధ్య కార్మికుల కష్టాలు తెలుస్తాయని అన్నారు. అప్పుడు రోడ్లపై ఇష్టానుసారంగా చెత్త వేయరు. ఇతర దేశాలకు వెళ్లినప్పుడు ఎక్కడా చెత్తవేయం. ఇక్కడ మాత్రమే ఇష్టానుసారంగా వ్యవహరిస్తాం. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి. మంగళగిరిలో భూగర్భ డ్రైనేజీ, అండర్ వాటర్, గ్యాస్, పవర్ అందుబాటులోకి వస్తే చాలా వరకు సమస్యలు తీరిపోతాయి. చెరువుల ఆధునీకరణకు దాదాపు రూ.3కోట్లు వెచ్చిస్తున్నాం. పారిశుద్ధ్యం నిర్వహణలో మంగళగిరిని నెం.1 నిలబెడతామని అన్నారు. ముఖాముఖి అనంతరం పారిశుద్ధ్య కార్మికుడు నాగార్జునను మంత్రి శాలువాతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఎకో పార్క్ లో వాకింగ్ చేసే మంగళగిరివాసులకు సొంత నిధులు రూ.5 లక్షలు వెచ్చించి ఉచిత ప్రవేశం కల్పించిన మంత్రి నారా లోకేష్ ను నేచర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి కఅతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలనే లక్ష్యం

కూరగాయలు అక్కడే ఉంచడంతో కుళ్లి పోయి పరిసరాలు కలుషితం అవుతున్నాయి. వేస్ట్ టూ ఎనర్జీ కింద కంపోస్ట్ తయారు చేసే టెక్నాలజీ వచ్చింది. రోజుకు ఒక టన్ను చెత్త వేస్తే కంపోస్టు తయారవుతుంది. నేను ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెట్టాను. సమాజం కోసం పనిచేయండి. మన ఆరోగ్యం కాపాడే మున్సిపల్ కార్మికులను నా పక్కన కూర్చోబెట్టుకున్నాను. వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. మన్సిపల్ కార్మికులను ఆదుకునే బాధ్యత మేము తీసుకుంటాము. ఇంట్లో చెత్త బయట వేసి పరిసరాలు కలుషితం చేయొద్దు. పొడి చెత్త, తడి చెత్త రెంటినీ వేరు చేస్తే ఎంతో ఉపయోగపడతాయి. గుర్రపు డెక్క నుంచి కూడా బ్యాగులు, ఎరువులు తయారు చేసే పరిస్థితికి వచ్చాం. బ్యాగులు కూడా తయారుచేస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం కార్యక్రమంపై ప్రజల్లో మరింత చైతన్యం కలిగించేందుకు ముందుకొచ్చిన వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ప్లాస్టిక్ పెను భూతం. ప్రకృతిని నాశనం చేస్తోంది. ప్లాస్టిక్ తినడంతో శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్లు వస్తున్నాయి. ఒకప్పుడు పంజాబ్ రాష్ట్రం దేశానికి అన్నం పెట్టింది. కానీ వారు పండించే పంటకు రసాయన ఎరువులు కొట్టడంతో అవి తింటున్న ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. నేడు ప్రతి రోజూ పంజాబ్ నుంచి ఢిల్లీకి క్యాన్సర్ రోగులతో ఒక ట్రైన్ వస్తోందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మా అత్తగారు క్యాన్సర్ తో చనిపోయారు. ఆవిడ పేరుతో బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిని నెలకొల్పి వైద్య సేవలు అందిస్తున్నాము. క్యాన్సర్ నివారణపై ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేందుకు ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుణ్ణి సలహాదారుగా నియమించాం.

**అక్టోబర్ 2 తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తా**

మళ్లీ 95 నాటి ముఖ్యమంత్రిని చూస్తారు. అక్టోబర్ 2 తర్వాత రాష్ట్రమంతటా ఆకస్మిక తనిఖీలు చేస్తాను. మీ ఊరికి వచ్చే విషయం కేవలం రెండు, మూడు గంటల ముందే తెలుస్తుంది. ఎమ్మెల్యేలు పరుగెత్తాల్సి వస్తుంది. సమైక్యాంధ్రలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం దేశంలోనే మొదటిసారిగా నేను ప్రారంభించాను. . ప్రధాని మోదీ ఆదేశాల ప్రకారం స్వచ్ఛ భారత్ నివేదిక ఇచ్చాను. నా ఆశయం ఒకటే స్వచ్ఛమైన ఏపీ తయారుచేయాలి. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర మా లక్ష్యం. విశాఖ ,గుంటూరులో 30 మెగావాట్ల రెండు వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు నెల్లూరు, రాజమండ్రిలో రూ.700 కోట్లతో 22 మెగావాట్ల విద్యుత్ తయారుచేసే ప్లాంట్లు పెడుతున్నాం. రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త రోడ్లపై ఉంది. అందులో 51 లక్షల చెత్త తొలగింపు పూర్తయింది. అక్టోబర్ 2 నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేసేందుకు మంత్రి నారాయణ పనిచేస్తున్నారు. 2027 నాటికి 100 శాతం మురుగునీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వాడుతాం. ఒకప్పుడు మరుగుదొడ్లు ఉండేవి కాదు. మహిళల ఆత్మ గౌరవం పేరుతో కొత్తవి నిర్మించాం. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4 లక్షల 60 వేల మరుగుదొడ్లు మంజూరు చేశాం. అందులో 72 వేల మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పట్టణాలు, మండల హెడ్ క్వార్టర్స్ లో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మిస్తాం.

**ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి విభాగానికి పెర్మామెన్స్ ఇండికేటర్ ర్యాంకింగ్స్ తయారుచేశాం. మున్సిపల్ శాఖకు 20 పాయింట్లు , పంచాయతీ రాజ్ కు 28 పాయింట్లు, ఎడ్యుకేషన్ కు 14 పాయింట్లు, టూరిజంకు 11 పాయింట్లు, ఇండస్ట్రీస్కు 13 పాయింట్లు, హాస్టల్స్ కు 11 పాయింట్లు , ఎండోమెంట్ కు 11 పాయింట్లు , ఆస్పత్రులకు 9 పాయింట్లు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కు 5 పాయింట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లకు 7 పాయింట్లు, మార్కెట్స్ కు 9 పాయింట్లు, హైవేస్ కు 3 పాయింట్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు 7 పాయింట్లు చొప్పున ఇచ్చాం. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ లో జిల్లాల ప్రోగ్రెస్ గమనిస్తే.... ఎన్టీఆర్ జిల్లా 134 పాయింట్లు, అనాకపల్లి జిల్లా 131 పాయింట్లు , తిరుపతి 128 పాయింట్లు, విశాఖ 127 పాయింట్లు, అనంతపురం 123 పాయింట్లు, కాకినాడ 121 పాయింట్లు, గుంటూరు 119 పాయింట్లు, ఈస్ట్ గోదావరి 118 పాయింట్లు, పల్నాడు 117 పాయింట్లు, అన్నమయ్య 115 పాయింట్లు, అంబేద్కర్ కోనసీమ 115 పాయింట్లు, శ్రీకాకుళం 113 పాయింట్లు, వైఎస్సార్ 113 పాయింట్లు, బాపట్ల 111 పాయింట్లు, ఏలూరు 108 పాయింట్లు, కర్నూలు 104 పాయింట్లు, నంద్యాల 102 పాయింట్లు, సత్యసాయి 102 పాయింట్లు, పార్వతీపురం 100 పాయింట్లు, పొట్టి శ్రీరాములు 100 పాయింట్లు, విజయనగరం 100 పాయింట్లు, కృష్ణా 99 పాయింట్లు, ప్రకాశం 99 పాయింట్లు, వెస్ట్ గోదావరి 97 పాయింట్లు , చిత్తూరు 91 పాయింట్లు, అల్లూరు సీతారామరాజు 68 పాయింట్లు వచ్చాయి. ఐవీఆర్ ఎస్ ద్వారా అందరి పనితనాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటాను. జపాన్ వంటి దేశాల్లో రోడ్డుపై చెత్త వేయరు. మనకూ అలాంటి అలవాట్లు రావాలి. మున్సిపల్ శాఖలో వివిధ పనుల నిమిత్తం...పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా రూ. 150 కోట్లు గ్రాంట్ గా అందబోతున్నాయి.

**తణుకులో పలు అభివృద్ధి కార్యక్రమాలు**

తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ డైనమిక్ లీడర్. తణుకులో పలు అభివృద్ధి పనులకు నిధులు కావాలని అడిగారు. తప్పకుండా మంజూరు చేస్తాం. ఇక తణుకు అనగానే ప్రముళఖ పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ గారిని మనం గుర్తుచేసుకోవాలి. ఆయన తణుకు మున్సిపాలిటీకి ఎన్నో సేవలు చేశారు. ఈ నియోజకవర్గ ప్రజలు టీడీపీకి ఎక్కువ సార్లు పట్టం కట్టారు. అయితే....తణుకు అనగానే టీడీఆర్ బ్రాండ్లు గుర్తొస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. అంతకుముందు తణుకు కూరగాయల హోల్ సేల్ మార్కెట్ ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. వ్యాపారం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఎన్టీఆర్ పార్కులో చెత్తను ఊడ్చారు.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.

## ఏపీని నెంబర్‌వన్ చేయడమే నాలక్ష్యం : చంద్రబాబు

సహకరించాలని కోరారు. పరిసర ప్రాంతాలను ప్రతిఒక్కరూ శుభ్రంగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లపై ప్రతి రోజు 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పోస్తుందని, 51 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మున్సిపల్ సిబ్బంది సేకరిస్తున్నారని తెలిపారు. అక్టోబర్ 2న నాటికి ఎక్కడా చెత్త కనిపించకుండా చేస్తామని, ఆ బాధ్యతను మంత్రి నారాయణకు అప్పగించామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆత్మగౌరవం పేరుతో గతంలో మరుగుదొడ్లు నిర్మాణానికి పిలుపునిచ్చానని చెప్పారు. 4 లక్షల 60 వేల మరుగుదొడ్లను మళ్లీ నిర్మించబోతున్నామన్నారు. ఇప్పటికే 72 వేల మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రారంభించినట్లు చంద్రబాబు వెల్లడించారు.

**స్వచ్ఛాంధ్ర - ఉద్యమం**

మన ఆరోగ్యానికి ఎందుకు ఇబ్బందులు వస్తున్నాయో ఆలోచించాలన్నారు చంద్రబాబు. తిండి, తాగేనీరు, అపరిశుభ్రత వలన వస్తున్నాయని కూడా గమనించాలన్నారు. ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్‌తో 25 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపొందించామన్నారు. విజన్ రూపొందించడమే కాదని.. తలసరి ఆదాయం పెరిగిందా లేదా అని పరిశీలిస్తున్నామని అన్నారు. వారసత్వంగా 87 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలిపోయారని%ొ%దానిని తీయడానికి నాలుగైదు నెలలు పడుతుందన్నారు. స్వర్ణాంధ్ర కోసం ఉద్యమం చేస్తూనే, స్వచ్ఛాంధ్ర కోసం ఉద్యమం చేయాలన్నారు. వేస్ట్ ఎనర్జీ కింద కంపోస్టు తయారుచేయడానికి ఒక టెక్నాలజీ వచ్చిందని తెలిపారు. బయో డైవర్సిటీ పేరుతో 10 లక్షలతో మెటీరియల్ పెడితే, కంపోస్టు తయారు చేయవచ్చని చెప్పారు. తణుకు ఎన్టీఆర్ పార్క్‌ను తాను డెవలప్ చేశానని.. కానీ దానిని నాశనం చేశారని ఫైర్ అయ్యారు.

**ప్లాస్టిక్ ప్రమాదకరం**

‘ఒక బాధ్యత కలిగిన ప్రభుత్వం వచ్చినపుడు, మీరు కూడా బాధ్యతతో వ్యవహరిస్తే, మంచి ఫలితాలు వస్తాయన్నారు చంద్రబాబు. ఒకప్పుడు పారిశుద్ధ్య కార్మికులను చులకనగా చూసేవారు. వారు మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. వారిపై గౌరవం పెరిగింది.. మునిసిపల్ కార్మికులు అందరిని ఆదుకుంటాం. మీ పరిసరాలు, మీ ఇల్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సమాజం కోసం, స్వర్ణాంధ్ర కోసం స్వచ్ఛందంగా పనిచేయడానికి ముందుకు వచ్చారు..వారిని అభినందించాలి. వారి కోసం ఒక యాప్‌ను రూపొందిస్తాం. ప్లాస్టిక్ చాలా ప్రమాదకరం.. పశువులు వాటిని తిని, చనిపోతున్నాయి. ప్లాస్టిక్ వలన తినే తిండి కూడా విషం అయిపోతున్నది. క్యాన్సర్ వచ్చినప్పుడు బాధ పడుతున్నాం. కానీ క్యాన్సర్ కారణమైన ఆహారం గురించి ఆలోచించాలి. రాష్ట్రంలో క్యాన్సర్ రాకుండా చేయడానికి నోరి దత్తాత్రేయుడుని సలహాదారుగా నియమించాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధమే చేయాలి. దానివలన చెడు పరిణామాలు ఉన్నాయి. ప్రమాదకరమైన ప్లాస్టిక్ తయారుచేసే వారిని నియంత్రిదాం’ అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**హక్కులు కావాలంటే బాధ్యతలు నిర్వహించాలి..**

‘హక్కులు అడిగే వాళ్లు బాధ్యతగా ఉండాలని, చురుకుగా పని చేసిన వారికి అన్ని దక్కుతాయి అని అన్నారు చంద్రబాబు. గత ముఖ్యమంత్రి ప్రజల్లోకి ఒక్కసారైనా వచ్చారా?. పరదాలు కట్టుకుని మాత్రమే బయటకు వచ్చారు. విమానంలో వస్తే చెట్లను నరికేవాళ్లు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఒప్పుకునే వాళ్లు కాదు. మాది ప్రజా ప్రభుత్వం. సమస్యలు వినేందుకే నేను వచ్చా. పాలనలో సంస్కరణలు తెస్తాం. రాష్ట్రానికి పది లక్షల కోట్ల అప్పు ఉంది. అప్పుతో పాటు వడ్డీ కూడా కట్టాల్సి వస్తోంది. గత సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని పూర్తిగా విధ్వంసం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో ముందుక వెళ్తున్నాం. పేదల పింఛన్ ను రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచాం. గతంలో రూ. 200 నుంచి రూ. 2000లకు పెంచాం. దివ్యాంగులకు రూ. 3 వేలు నుంచి రూ. 6వేలు అందజేస్తున్నాం.” అని చంద్రబాబు పేర్కొన్నారు.

**47 ఏళ్ల క్రితం ఇదే రోజున ..**

ప్రజల ఆశీస్సులతో 47 ఏళ్ళ క్రితం ఇదే రోజు, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశానని తెలిపారు చంద్రబాబు. 41 ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్నానని వెల్లడించారు.. 9 ఏళ్ళు సమైక్యాంధ్ర సీయంగా, మొత్తంగా 14 ఏళ్ళకు పైగా సీయంగా ఉన్నా. పదేళ్ళు ప్రతిపక్ష నేతగా చేశారని పేర్కొన్నారు.. ఇది ప్రజలు నాకు ఇచ్చిన గౌరవం ఇదని, అందుకే నా చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు, తెలుగువారికి న్యాయం చేయాలనే ఏకైక సంకల్పంతో పని చేస్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి రామ్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అశ్మి, తణుకు యంయల్ఏ ఆరుమిల్లి రాధాకృష్ణ, యంయల్ఏలు పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, శాసనమండలి మాజీ విప్ అంగర రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 1550 కోట్లతో ఆంధ్రాలో జాతీయ రహదారులు

వాహనదారులకు అధునాతన సదుపాయాలను అందిస్తున్నాయి.కొయ్యూరులో హైవే పనులు చివరి దశలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొయ్యూరు మండలం పరిధిలో హైవే నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఘాట్ రోడ్లు పూర్తిగా మెరుగుపడటంతో వాహనదారులు సులభంగా ప్రయాణించగలుగుతున్నారు. ఇంతకు ముందు చింతాలమ్మ ఘాట్ రోడ్డులో ప్రమాదకరమైన మలుపుల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. కానీ ఇప్పుడు హైవే నిర్మాణంతో మలుపులు విశాలంగా మారాయి.

**ఘాట్ రోడ్లకు కొత్త రూపం**

కొండ ప్రాంతాల్లో ఉన్న రహదారులు తళతళా మెరుస్తున్నాయి. ఈ మార్గంలో ట్రావెల్ చేయడం ఒక అనుభూతిగా మారుతోంది. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ఎంతో అనువుగా మారిన ఈ మార్గం ప్రయాణికులకు కొత్త అనుభూతిని అందించనుంది.

నిర్మాణంలో భాగంగా కీలక బ్రిడ్జిలు
రామరాజుపాలెం బ్రిడ్జి %-% పూర్తయింది.
నడింపాలెం బ్రిడ్జి %-% పూర్తయింది.
కృష్ణదేవిపేట బ్రిడ్జి %-% నిర్మాణం కొనసాగుతోంది.
పెదమాకవరం బ్రిడ్జి %-% వేగంగా పనులు సాగుతున్నాయి.
పాడేరు బైపాస్ రోడ్డు నిర్మాణం
పాడేరు శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దాదాపు రూ. 89 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ మరో ఆరు నెలల్లో పూర్తవుతుందని అంచనా. బైపాస్ రోడ్డుతో పాడేరు పరిసర ప్రాంతాల ట్రాఫిక్ భారాన్ని తగ్గించనున్నారు.
హైవే నిర్మాణం పూర్తయ్యే నాటికి ప్రయోజనాలు

ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది
వ్యాపారం, రవాణా మరింత మెరుగుపడుతుంది
ఉత్తరాంధ్ర రీజియన్ అభివృద్ధి చెందుతుంది
కొండ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి
టోల్‌గేట్ ఏర్పాటుతో మరింత సౌకర్యం
రామరాజుపాలెం సమీపంలో టోల్‌గేట్ ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల హైవే నిర్వహణకు నిధులు లభిస్తాయి. అంతేకాదు, భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయి.

**1550 కోట్లతో హైవే నిర్మాణం**

430 కిలోమీటర్ల మేర విస్తరించనున్న 516(ఈ) నేషనల్ హైవే కోసం రూ. 1550 కోట్ల వ్యయం అంచనా వేసింది. ఈ భారీ ప్రాజెక్ట్ వల్ల ఉత్తరాంధ్ర నుంచి కోస్తాకు కనెక్టివిటీ పెరుగుతుంది.

**మంచి రోజులు మన్యం ప్రాంతానికి**

ప్రస్తుతానికి పనులు 60% పూర్తి కాగా, మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నారు. మలుపుల రోడ్లు, బ్రిడ్జిలు, టోల్‌గేట్లు, బైపాస్ రోడ్లు అన్నీ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతానికి మరింత అభివృద్ధి చేకూరనుంది.

## ఏపీ ప్రభుత్వం వినూత్న కార్యక్రమం..

భారీగా నిర్వహించే ఈ వేడుకలో ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి, ఇతర సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. ప్రతిపక్ష నేతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని కొనియాడే అవకాశం ఉంది. ప్రజల నుంచి స్వీకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ అవార్డులు తీసుకోవడం ద్వారా నేతలు తమ పనితీరును మెరుగుపరచుకుంటూ మరిన్ని ప్రజా సేవలపై దృష్టి పెడతారు.

## రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు

42 డిగ్రీలు దాటిపోయింది. దాంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని అక్కడి జనం ఆందోళన చెందుతున్నారు. కోస్తాలోని కొన్ని జిల్లాల్లో వాతావరణం అనూహ్యంగా మారుతోంది.

**డీహైడ్రేషన్, తలనొప్పి, నీరసం**

మార్చిలోనే భానుడు తన ప్రతాపంతో టాప్ లేపేస్తున్నాడు.. ఈ ప్రాంతం అ ప్రాంతం అని తేడాలేకుండా మంటలు పుట్టిస్తున్నాడు. దీంతో జనాలు అసమ్మర్ హీట్ ను బీట్ చేసేందుకు చల్ల చల్లని,కూల్ కూల్ గా వుండే ఫ్రూట్స్ , సమ్మర్ డ్రింక్స్ ను తీసుకుని ఎండ ప్రతాపాన్నికూల్ చేస్తున్నారు. మరో వైపు వేడి తీవ్రత అధికంగా ఉండటం వల్ల డీహైడ్రేషన్, తలనొప్పి, నీరసం, గుండెపోటు ప్రమాదాలు పెరుగుతాయి అంటున్నార వైద్య నిపుణులు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు.ఓ

## 24 గంటల్లో యుద్ధం ఆపేస్తానని

# వ్యంగ్యంగా చెప్పా: ట్రంప్



అమెరికా : తాను మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఒక్క రోజులోనే ఆపేస్తానని ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఆ వ్యాఖ్యలపై స్పందించారు. ఆ మాటల్లో కొంచెం వ్యంగ్యం దాగి ఉందని తాజాగా అంగీకరించారు. అయితే యుద్ధ సమస్యను పరిష్కరించాలని అనుకుంటున్నానని, ఆ దిశగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తంచేశారు.

అతిశయోక్తి కలిగించే ప్రకటనలు చేయడం ఆయనకు కొత్తేం కాదు. అయితే యుద్ధం గురించి అలా చేసిన వ్యాఖ్యను ఆయన అంగీకరించడం గమనార్హం. 'ఫుల్ మెజర్' టెలివిజన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ట్రంప్ స్పందించారు. గతంలో ట్రంప్ మాట్లాడుతూ.. "2024లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు ముగిసేలోగా యుద్ధం కొలిక్కి రాకపోతే.. నేను అమెరికా అధ్యక్షుడిగా మళ్లీ ఎన్నికైతే.. ఒక్క రోజులో శాంతి పరిష్కారాన్ని చూపుతా. సులభమైన చర్చలతో రెండు దేశాల మధ్య వివాదానికి తెర పడుతుంది" అని తెలిపారు. 2020లోనే తాను మళ్లీ అధ్యక్షుడిగా గెలిచిఉంటే.. ఈ సంక్షోభం ఏర్పడేదే కాదన్న వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

ఇదిలాఉంటే.. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు కోసం ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి పుతిన్ సూత్రప్రాయంగా అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని అమెరికా అధ్యక్షుడు స్వయంగా వెల్లడిస్తూ హర్షం వ్యక్తంచేశారు. కాల్పుల విరమణకు సంబంధించి రష్యా నుంచి మంచి సంకేతాలు వస్తున్నాయని, మాస్కోతో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయని అన్నారు. యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఉక్రెయిన్‌ను కనికరించాలని పుతిన్‌కు తాను విజ్ఞప్తి చేసినట్లు ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి ఉక్రెయిన్ అంగీకరించిన సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ హయాంలో

## 7 రోజులు జైల్లో ఉన్నా: అమిత్ షా



**గువాహటి: అస్సాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాను కూడా నిర్బంధాలను ఎదుర్కొన్నానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు నిర్వహించిన ఆందోళన కారణంగా తనని జైల్లో పెట్టారని, తనపట్ల కఠినంగా వ్యవహరించారని పేర్కొన్నారు. డెర్గావ్‌లోని లచిత్ బర్ఫుకాన్ పోలీసు అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం తన విద్యార్థి జీవితాన్ని అమిత్ షా గుర్తు చేసుకున్నారు.**

"అస్సాంలో హితేశ్వర్ సైకియా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రధాని ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా విద్యార్థులంతా కలిసి ఆందోళన నిర్వహించాం. అప్పట్లో నన్ను 7 రోజుల పాటు జైల్లో పెట్టారు. నా పట్ల కఠినంగా వ్యవహరించారు. నాపై భౌతికంగా దాడి చేశారు కూడా" అని అమిత్ షా అన్నారు. సైకియా అస్సాంకు కాంగ్రెస్ తరఫున రెండు పర్యాయాల పాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా అస్సాంలో శాంతికి ఏమాత్రం కృషి చేయలేదని అమిత్ షా దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన 10 ఏళ్లలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగయ్యాయని చెప్పారు. 10 వేల మంది యువత ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారని పేర్కొన్నారు. ఈ పోలీసు అకాడమీకి లచినత్ బర్ఫుకన్ పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు. మొఘలుల సామ్రాజ్యకాంక్షను, వారి దాష్టీకాలను ఎదుర్కొన్న వారిలో లచిత్ బర్ఫుకన్ ఒకరు. ఆయన చరిత్ర కేవలం అస్సాంకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా తెలియాల్సిన అవసరం ఉందని అమిత్ షా అన్నారు.

# 214 మంది పాక్ సైనికులను హతమార్చాం

### బలూచ్ తిరుగుబాటుదారులు



పాకిస్థాన్ : పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బలూచ్ మిలిటెంట్లు మంగళవారం ప్రయాణికుల రైలును హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ కీలక ప్రకటన చేసింది. తమ రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ముగియడంతో తమ చెరలో ఉన్న 214 మంది పాక్ సైన్యాన్ని చంపేసామని పేర్కొంది. ఆపరేషన్ ముగిసిందంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వం చేసిన ప్రకటనను కూడా ఖండించింది.


'మా రాజకీయ ఖైదీల విడుదలకు పాకిస్థాన్ సైన్యానికి 48 గంటల సమయం ఇచ్చాం. మా చెరలో బందీలుగా ఉన్న వారిని రక్షించుకునేందుకు సైన్యానికి మేము ఇచ్చిన చివరి అవకాశం. కానీ, పాక్ తన మొండితనాన్ని, సైనిక దురహంకారాన్ని ప్రదర్శించింది. ఫలితంగా శత్రు సైన్యానికి చెందిన 214 మందిని మేం హతమార్చాం. బీఎల్ఏ ఎప్పుడూ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తుంది. అయితే ఇస్లామాబాద్ సైన్యం తమ సిబ్బందిని కాపాడుకునేందుకు బదులుగా మాతో పోరాడాలని ప్రయత్నించింది. ఫలితంగా బందీలను కోల్పోయింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ బోగిల్లోని బందీలను రక్షించేందుకు పాకిస్థాన్‌లోని ఎస్ఎస్‌జీ కమాండోలు రాగానే మా యోధులు వారిని చుట్టిముట్టి భీకర దాడి చేశారు. గంటల పాటు సాగిన ఈ దాడుల్లో పలువురు బందీలను ఉరితీయగా.. ఎస్ఎస్‌జీ కమాండోలు భారీ ప్రాణనష్టాన్ని చవిచూశారు. మా వాళ్లు చివరి బుల్లెట్ వరకు పోరాడారు.

చనిపోయిన తిరుగుబాటుదారుల మృతదేహాలను చూపించి విజయం సాధించామని ఇస్లామాబాద్ ప్రభుత్వం వాస్తవాలను కూడా కప్పిపుచ్చుతోంది. సైన్యం, ఇంటెలిజెన్స్ బృందం ఉన్నప్పటికీ బందీలను రక్షించుకోవడంలో శత్రు సైన్యం విఫలమైంది. యుద్ధ సూత్రాలకు కట్టుబడి మేం విడుదల చేసిన వారిని కాపాడినట్లు ప్రకటించుకుంటుంది. ఈ యుద్ధం ఇంకా ముగియలేదు. బలూచ్ యోధులు వివిధ ప్రాంతాల్లో మెరుపుదాడులతో ఆక్రమిత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో బలూచ్ విజయం సాధించింది' అని మిలిటెంట్ సంస్థ పేర్కొంది. ఇక, హైజాక్ సమయంలో మరణించిన బీఎల్ఏలకు మిలిటెంట్ సంస్థ నివాళులర్పించింది.

పాక్‌లోని క్వెట్టా నుంచి పెషావర్‌కు 440 మంది ప్రయాణికులతో వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలూచ్ వేర్పాటువాదులు హైజాక్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది బందీలు మరణించగా.. దాదాపు 33 మంది వేర్పాటువాదులను మట్టుబెట్టి మిగతా ప్రయాణికులు అందరినీ సురక్షితంగా విడిపించామని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. బలూచ్ మిలిటెంట్లు చంపిన 26 మంది బందీల్లో 18 మంది సైనికులని పాక్ ఆర్మీ కూడా పేర్కొంది. ఇక, ఈ ఆపరేషన్ ముగిసినట్లు ప్రకటన విడుదల చేసింది. అయితే, బలూచ్ మిలిటెంట్లు ఇందుకు విరుద్ధంగా పేర్కొనడం గమనార్హం.

## ట్రక్కును ఢీకొట్టిన అమరావతి ఎక్స్‌ప్రెస్

### మహారాష్ట్రలో తప్పిన పెను ప్రమాదం




**ముంబయి: మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. రైలు పట్టాలపై నిలిచిపోయిన ఓ ట్రక్కును వేగంగా వచ్చిన అమరావతి ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు.**

బోద్వాడ్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం 4.30 గంటల సమయంలో ఓ ట్రక్కు లెవెల్ క్రాసింగ్‌ను ఢీకొట్టి పట్టాలపై నిలిచిపోయింది. అప్పటికే డ్రైవర్ కిందకు దిగి సహాయం కోసం కేకలు వేశాడు. అదేసమయంలో ముంబయి నుంచి అమరావతి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ట్రక్కును ఢీకొట్టింది. ట్రక్కును గమనించిన లోకో పైలట్ వేగాన్ని తగ్గించడంతో రైలుకు ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. సహాయక చర్యలు చేపట్టి రైలింజన్ ముందు భాగంలో చిక్కుకున్న ట్రక్కును బయటకు తీశారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు 6 గంటల పాటు అంతరాయం ఏర్పడింది.

## యజమాని ఉండని లడ్డూ దుకాణం



**జబల్‌పుర్: నిర్వాహకులు లేని దుకాణం ఉందంటే వింతేకదా! అక్కడ కొనుగోలు చేసే మిఠాయిలకు కొనుగోలుదారులే నిజాయతీగా డబ్బులను గల్లాపెట్టెలో వేస్తారంటే విశేషమేకదా? దీనికి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌లో గల ఓ లడ్డూ దుకాణం వేదికగా నిలుస్తోంది.**

జబల్‌పుర్‌లోని నేపియర్ టౌన్‌లో విజయ్ పాండే అనే లడ్డూ వ్యాపారి లడ్డూ గోపాల్ (బాల గోపాలుడు) భక్తుడు. ఓ సారి ఓ వ్యక్తి విజయ్ పాండే ఇంటికి వెళ్లి తన ఆర్థిక పరిస్థితి బాగా లేదని.. లడ్డూ గోపాల్ స్వామికి సమర్పించేందుకు లడ్డూలు కావాలి..డబ్బులు తర్వాత ఇస్తానన్నాడు. అతడి పరిస్థితిని పెద్ద మనసుతో విజయ్ అర్థం చేసుకున్నాడు. అటువంటి వారికి సహకరించేందుకు 'శ్రీ లడ్డూ గోపాల్' పేరుతో ఒక ప్రత్యేకమైన లడ్డూ దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. ఆ దుకాణంలో ఎవరూ అందుబాటులో ఉండరు. భక్తులు నిస్సంకోచంగా లోపలికి వెళ్లి, గల్లా పెట్టెలో డబ్బులు వేసి లడ్డూ బాక్స్‌ను తీసుకోవచ్చు. డబ్బులు లేని వారు ఉచితంగానే మిఠాయి పెట్టె తీసుకోవచ్చు. ఆ తర్వాత డబ్బులు ఉన్నప్పుడు వచ్చి పేమెంట్ చేయొచ్చు. ఈ దుకాణంలోని ప్రతీ మిఠాయి పెట్టెపై అది ఏ రకం స్వీట్ ? దాని ధర ఎంత ? అనే సమాచారం వివరంగా రాసి ఉంటుంది. 'లడ్డూ గోపాల్ స్వామిని భక్తులు మోసం చేయరు అనేది నా నమ్మకం' అని విజయ్ పాండే 'ఈటీవీ భారత్'తో తెలిపారు.

## ట్రంప్ మరో దూకుడు నిర్ణయం..

# 41 దేశాలపై ట్రావెల్ బ్యాన్..?

వాషింగ్టన్: ఉద్యోగాల కోతలు, దేశాలపై సుంకాలతో దూకుడు పాలన సాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. పదుల కొద్దీ దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే అంశాన్ని ట్రంప్ సర్కారు పరిశీలిస్తున్నారట. 41 దేశాల పౌరులు అగ్రరాజ్యంలోకి రాకుండా త్వరలో ప్రయాణ ఆంక్షలు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

ఇందుకు సంబంధించి ఒక ఇంటర్నల్ మెమో బయటికొచ్చింది. అందులో మొత్తం ఈ 41 దేశాలను మూడు గ్రూప్‌లుగా విభజించినట్లు సమాచారం. పది దేశాలతో ఉన్న మొదటి గ్రూప్‌లో అఫ్గానిస్థాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తరకొరియా వంటివి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాల పౌరులకు వీసాల జారీ పూర్తిగా నిలిపివేయనున్నారట. ఇక, రెండో గ్రూప్‌లో ఇరిట్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆ మెమోలో పేర్కొన్నారు. ఈ దేశాలకు పర్యటక, విద్యార్థి వీసాల వంటివి జారీ చేయకూడదని భావిస్తున్నారు. అయితే వీటికి కొన్ని మినహాయింపులు కల్పించే అవకాశాలున్నాయి.

మూడో గ్రూప్‌లో పాకిస్థాన్, భూటాన్ సహా 26 దేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాలు 60 రోజుల్లోపు తమ 'లోపాలను పరిష్కరించుకోవడానికి' ప్రయత్నాలు చేయకపోతే అక్కడి పౌరులకు వీసా జారీని పాక్షికంగా నిలిపివేయాలని యూఎస్ యంత్రాంగం భావిస్తున్నట్లు ఆ మెమోలో ఉంది. ప్రస్తుతానికి ఈ జాబితాను అమెరికా మీడియా సంస్థలు ప్రచారం చేయగా.. ఇందులో మార్పులు ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆమోదం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం.

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఇలాంటి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్ సహా ఏడు ముస్లిం మెజారిటీ దేశాల ప్రయాణికులపై నిషేధం విధించారు. అప్పట్లో ఈ నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ఇక, 2023లోనూ ట్రంప్ ఈ ప్రణాళికల గురించి ప్రస్తావించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపడితే గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, సిరియా యెమెన్ వంటి దేశాల నుంచి పౌరుల రాకపై ఆంక్షలు విధిస్తానని తెలిపారు. దేశ భద్రతకు ముప్పు అని భావించేవారిని అమెరికాలోనికి ఎన్నటికీ రానివ్వబోమని అన్నారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com


ఆదివారం 16 మార్చి 2025

# ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బండారు.



**రావులపాలెం, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వ ధ్యేయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గం లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 22 వినతులు వచ్చాయని వాటిని పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామన్నారు. అదే విధంగా నాడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో కొన్ని అమలు అవుతున్నాయని అలాగే మిగతా పథకాలను కూడా త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని అర్హులైన వారందరికీ పథకాలను అందిస్తామని సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవ స్వామిని దర్శించిన తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రెటరీ టిఎన్ వెంకటేష్.




**ఆత్రేయపురం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలోని ప్రముఖ స్వయంభు పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారి దర్శనానికిటీఎన్ వెంకటేష్ ప్రిన్సిపల్ సెక్రటరీ, తమిళనాడు షిప్పింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శనివారం ఉదయం వచ్చారు. వీరికి ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి స్వామివారి దర్శనం కోసం ఏర్పాటుచేసారు. అనంతరం వేద పండితులు ఫణి ఆశీర్వచనం చేశారు, అనంతరం ఆలయ ఈవో, అర్చకులు, సిబ్బంది శ్రీ స్వామి వారి శేషవస్త్రం, ఫొటో, చరిత్ర పుస్తకం, శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదం అందజేసి సత్కరించారు.

## ఘనంగా చెల్లుబోయిన పుట్టినరోజు




**సఖినేటిపల్లి మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు శనివారం నాడు ఘనంగా జరిగాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం శృంగారపాడు మణికుమారి వృద్ధుల ఆశ్రమంలో ఈ వేడుకలు నిర్వహించారు. టిడిపి నాయకులు కేకు కట్ చేసి శ్రీనివాస్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సఖినేటిపల్లి మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తాడి మోహన్ బాబు, గ్రామ శాఖ చెల్లుబోయిన చిన్నారి, కొల్లాబత్తుల చిరంజీవి, వివి మెరక గ్రామశాఖ అధ్యక్షులు చెల్లుబోయిన జయ సూరిబాబు, రాష్ట్ర రజక సాధికార కమిటీ సభ్యులు అంతర్వేదిపాలెం పుల్లయ్య, సఖినేటిపల్లి మండలం ఐటిడిపి అధ్యక్షులు పమ్మి దుర్గాప్రసాద్, పాలపర్తి శేఖర్ బాబు, కొల్లబత్తుల ప్రవీణ్, చెల్లుబోయిన శ్రీనివాస్ (మెంబర్), తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష మెటీరియల్స్ పంపిణీ చేసిన మాజీ సర్పంచ్ పండు రాంజీ

**ఐ.పోలవరం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఐ. పోలవరం మండలం టి. కొత్తపల్లి జడ్పీ హైస్కూల్లో మాజీ సర్పంచ్ పండు రాంజీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులు 37 మందికి పరీక్షా మెటీరియల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు ధైర్యంగా 10 పరీక్షలకు హాజరై మంచి ఫలితాలు తీసుకురావాలని పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పండు రాంజీ మాట్లాడుతూ గతంలో ప్రాథమిక పాఠశాలగా ఉన్న ఈ పాఠశాలను దివంగత లోక్సభ స్పీకర్ జిఎంసి బాలయోగి కృషితో హై స్కూల్ గా అప్ గ్రేట్ చేయడం జరిగిందన్నారు. ప్రతి యేటా జనవరి 26 రిపబ్లిక్ డే నాడు పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరు విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మన హైస్కూల్ విద్యార్థులకు చదువుతోపాటు సరైన వ్యాయము అవసరం అన్నారు. దీనికి సంబంధించి ప్రధాన సమస్యగా ఉన్న ఆటస్థలం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే గ్రామ కార్యదర్శి కి పంచాయతీ పరిధిలోని నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని గుర్తించడం జరిగిందని ఈ విషయమై ఉన్నత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎస్ఎంఎస్ చైర్మన్ గాలి దేవర బాబ్జి, మాజీ ఎంపిటీసీ వల్లభ శెట్టి, ఎంపీటీసీ గోవిందు, టిఎన్ల్ టి సి ప్రెసిడెంట్ నక్క రామకృష్ణ, గ్రామ కమిటీ ప్రెసిడెంట్ ఉద్దేశ బుజ్జి, నల్లజర్ల సూర్యనారాయణ, సంఘాని ప్రసాద్, ఇళ్ల శ్రీనివాస్, పి భగవాన్దాస్, అప్పాడి బాబ్జి, తోపాటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు పదవ తరగతి విద్యార్థినిలు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలి

## - అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్చార్జి అధికారి రవి సుభాష్




**అమలాపురం, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించే దిశగా అధికారులంతా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఇన్చార్జి అధికారి పి. రవి సుభాష్ ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో ఆయన జిల్లాలో వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న ఫ్లాట్ షిప్ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి జిల్లా ప్రొఫైల్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు తమ శాఖల్లో అమలవుతున్న ముఖ్యమైన కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి అధికారి రవి సుభాష్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా తమ శాఖలకు సంబంధించిన లక్ష్యాలను సాధించందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి 21 శాతం వృద్ధిరేటును సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించిన నేపథ్యంలో సంబంధిత లక్ష్యాన్ని సాధించాలంటే తీసుకోవలసిన చర్యలైన సాగునీటిని ముందస్తుగా విడుదల చేయడం, నాణ్యమైన విత్తనాలు అందించడం, ప్రణాళికాబద్ధంగా ఎరువులను ఉపయోగించడం, మురుగు కాలవలను శుభ్రం చేయడం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. గత పది సంవత్సరాలుగా వ్యవసాయంలో సరాసరి వృద్ధిరేటు ఎంత ఉందో అంచనా వేసి ఈ సంవత్సరం 21 శాతం వృద్ధిరేటు సాధించాలంటే ప్రతినెలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రతినెలా ఒకసారి సమావేశం నిర్వహించి పురోగతిపై సమీక్షిస్తానన్నారు. ఇళ్లలో కిచెన్ గార్డెన్లు, హొమ్ కంపోసిట్ పిట్లకు సంబంధించి భూమి అందుబాటులో ఉందా లేదా అన్న అంశంపై సర్వే నిర్వహించినట్లు డిఆర్డిఏ అధికారులు తెలుపగా హౌస్ హోల్డ్ కంపోసిట్ పిట్స్ నిర్మించడానికి త్వరితగతిన ఎస్టిమేట్లు తయారుచేసి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ అధికారులను ఆయన ఆదేశించారు. ఎస్డబ్ల్యుపిసి షెడ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ మరియు అర్బన్ పథకం కింద ఏర్పాటుచేసిన లేఔట్లలో ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేసే అంశంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటిని అందించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని పీహెచ్సీలు, ఆసుపత్రులలో సమస్యలు ఏమైనా ఉంటే ఆయన దృష్టికి తీసుకురావాలన్నారు. అభా ఐడి రిజిస్ట్రేషన్లపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి రిజిస్ట్రేషన్లను పెంచాలన్నారు. టీనేజ్, హై రిస్క్ ప్రెగ్నెన్సీల మీద వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల షాపుల్లో యాంటీ బయోటిక్స్ అమ్మకుండా డ్రగ్ ఇన్స్పెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ఐసిడిఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని 117 గ్రామ పంచాయతీల్లో ఎస్డబ్ల్యుపిసి షెడ్ల నిర్మాణంలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. పరిశ్రమల శాఖ అధికారులు ఉద్యమ్ రిజిస్ట్రేషన్లు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 29 జనరిక్ మెడికల్ షాపులను బీసీలకు కేటాయించిందని డ్రగ్ ఇన్స్పెక్టర్, ఎల్డిఎం, డిఎంహెచ్వో బీసీ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసే 29 జనరిక్ మందుల షాపులను బీసీలకు కేటాయించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు అందరూ ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించడంలో భాగంగా రాష్ట్రస్థాయిలో వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమైనప్పుడు ఆయన దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ డాక్టర్ శివ శంకర ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, సిపిఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టీ.కే.వీ.పీ. ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి , కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఉన్నతి రుణాల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు.

**రావులపాలెం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం లబ్ధిదారులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెక్కులను, స్వయం సహాయక సంఘాల మహిళా వ్యాపార వేత్తలకు చెక్కులను పంపిణీ చేశారు. రావులపాలెం కొత్తకాలనీలో మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన డ్వాక్రా గ్రూపులు నేడు విశిష్ట ఫలితాలను ఇవ్వడంతో పాటు మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చేందుకు దోహదపడిందని తెలిపారు. పది కోట్ల రూపాయల రుణాలు మండలంలో మహిళలు పొందబోతున్నారని చెప్పారు. మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్ది, మహిళలను అన్ని రంగాల్లో భాగస్వాములను చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు.

## కోనసీమ తిరుమల వాడపల్లి ఆలయ పరిశీలన

### -దర్శన ఏర్పాట్లను భక్తులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు.

**రావులపాలెం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కోనసీమ తిరుమల, ఏడువారాల వెంకన్నగా, భక్తుల కోర్కెలు తీర్చే స్వామిగా విరాజిల్లుతున్న ఆత్రేయపురం మండల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి ప్రతి శనివారం భక్తులు భారీగా తరలి వస్తున్నారని తగు ఏర్పాట్లను పరిశీలించేందుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రంగంలోకి దిగారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల క్యూలైన్ లను పరిశీలించారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భక్తులకు త్వరిగతిన దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులను కలసి దర్శన ఏర్పాట్లలో ఉన్న లోటుపాట్లను తెలియజేయాలని, అలాగే భక్తుల సూచనలు, సలహాలను తీసుకుంటామని సత్యానందరావు స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే సత్యానందరావు వెల్లడించారు. అనతరం స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## బుద్ధుని బోధనలు అనుసరణీయం

**కాట్రేనికోన, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఫాల్గుణ పౌర్ణమి కార్యక్రమం కాట్రేనికోన మండలంలోని పి. లక్ష్మీవాడ, భట్టుచెరువు గ్రామాలలో ఉపాసక వడ్డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ భగవానుని బోధనలు గురించి వివరించారు. బుద్ధుని బోధనలు అనుసరణీయం అని, బౌద్ధం మతం కాదని ఒక మార్గమని ప్రతి ఒక్కరూ బుద్ధుని మార్గంలో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంతు బ్రహ్మయ్య, బడుగు శ్రీనివాస్, అజయ్, రమేష్, బోయిడి రాంజీ, కలకట రమణ, సాపే విజయ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## మందేశ్వర స్వామికి విశేషంగా తైలాభిషేకాలు



**కొత్తపేట, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే ఆలయానికి చేరుకుని శనిదోష నివారణకు తైలాభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తైలాభిషేకాల ద్వారా రూ. 1,35,8,25, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.36,6,21 వెరసి మొత్తం రూ.1,72,446 ఆదాయం వచ్చిందని డీసీ చక్రధరరావు తెలిపారు.






# గోరంట్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బత్తుల, బొడ్డు

కోరుకొండ మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి జన్మదిన వేడుకలు రాజమహేంద్రవరంలోని చెరుకూరి గార్డెన్స్ లో పలు పార్టీల నాయకులు అభిమానులు కార్యకర్తలతో కోలాహలంగా నిర్వహించారు. శుక్రవారం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జనసైనికులు తదితరులు గోరంట్ల బుచ్చయ్య చౌదరికి పుష్పగుత్యం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రాజమహేంద్రవరం రుడా చైర్మన్ రాజానగరం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి, గోరంట్లను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమల వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

## - వేసవి దృష్ట్యా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



ఆత్రేయపురం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం శనివారం భక్త జనంతో కిటకిటలాడింది. వేకువజామున ఆలయ అర్చకులు సుప్రభాత సేవ, తొలిహారతి నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఏడు శనివారాల వాడపల్లి వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే విశ్వాసంతో మాడవీధుల్లో ఏడు ప్రదిక్షణలు చేసి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొందరు తలనీలాలు సమర్పిం్షరు. కాలినడకన శుక్రవారం రాత్రికే ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు ఉదయం స్వామి దర్శనం చేసుకున్నారు. వేసవిని, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల వద్ద ఎయిర్ కూలర్లు, కూలర్ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. అలాగే క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచి నీరు, చిన్న పిల్లలకు పాలు, చిన్న పిల్లలకు, వృద్ధులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. వివిధ ఆర్టీసీ డిపోల నుంచి వాడపల్లికి ప్రత్యేక బస్సులు నడిపారు.



# పండుగ వేళ దారుణం పిల్లల్ని చంపి

# ఆత్మహత్యకు పాల్పడ్డ తండ్రి





కాకినాడ, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కాకినాడలో హెూలీ పండుగ నాడు జరిగిన దారుణం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ఈ పోటీ ప్రపంచంలో తన పిల్లలు రాణించలేరని భావించిన ఓ తండ్రి వారిని చంపేసి తాను ఉరివేసుకున్నాడు. ఈ ఘటనలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన వానపల్లి చంద్రకిశోర్ (ఓఎన్జీసీ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంటెంట్) గా పనిచేస్తున్నాడు. తన కుమారుడు జోషిల్ (7) మరియు కుమారుడు నిఖిల్ (6) ను హత్యచేసి, తాను ఉరి వేసుకున్నాడు.

**పిల్లలు సరిగా చదవడం లేదని మనస్తాపం**

హెూలీ పండుగ నాడు కాకినాడలోని సుబ్బారావునగర్‌లో జరిగింది ఈ దారుణం. పోలీసుల కథనం ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడానికి చెందిన వానపల్లి చంద్రకిశోర్ భార్య తనూజ, ఒకటో తరగతి చదివే కుమారుడు జోషిల్ (7), యూకేజీ చదివే చిన్న కుమారుడు నిఖిల్ (6),తో కలిసి నగరంలోని ఓ ఫ్లాట్‌లో ఉంటున్నాడు. పిల్లలుసరిగ్గా చదవడం లేదని ఇటీవల వారు చదువుతున్న స్కూల్ మార్పించాడు.

**బకెట్లో ముంచి చంపేసిన వైనం**

చంద్రకిశోర్ నిన్న భార్య, పిల్లలతో కలిసి ఆఫీసులో నిర్వహించిన హెూలీ వేడుకలకు హాజరయ్యాడు. ఆ తర్వాత పిల్లలకు యూనిఫాం కొలతలు తీయించేందుకు టైలర్ వద్దకు వెళ్తున్నానని, అక్కడే ఉండాలని, పది నిమిషాల్లో వస్తానని భార్యను నమ్మించి పిల్లలను తీసుకెళ్లాడు. ఎంతసేపటికీ భర్త రాకపోవడంతో అనుమానం వచ్చి తనూజ ఫోన్ చేసింది. ఫోన్ ఎత్తకపోవడంతో తోటి ఉద్యోగులను తీసుకుని ఇంటికి వెళ్లింది. తలుపు వేసి ఉండటంతో కిటికీ లోంచి చూడగా భర్త ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లగా పిల్లలిద్దరూ కాళ్లు, చేతులకు కట్లతో నిండా నీళ్లు ఉన్న బకెట్లలో తలలు మునిగిపోయి కనిపించారు. ఆ దృశ్యాలు చూసిన తనూజ కుప్పకూలిపోయింది.

**పోటీ ప్రపంచం**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో తన పిల్లలు పోటీ పడలేకపోతున్నారని, వారికి భవిష్యత్తు లేదని, అందుకే పిల్లల్ని చంపి తాను కూడా చనిపోతున్నానని చంద్రశేఖర్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**దర్యాప్తు**

కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ సోదరుడికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని ఆస్తులు ఉన్నాయని ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని మృతుడి బ్రదర్ వాపోతున్నారు. ఎంత పిల్లలు చదువులో వెనుకబడిపోతే మాత్రం ఇలా చంపేసి చచ్చిపోవటం ఏమిటి? అంటూ ఈ ఉదంతం గురించి తెలిసిన వారంతా షాక్ కు గురవుతున్నారు.

# విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు..


## హాట్ కేకుల్లా అమ్ముడుపోయిన టికెట్లు

**24న ఢిల్లీ-లక్నో, 30న ఢిల్లీ-హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు**

**నిన్న సాయంత్రం 4 గంటలకు రూ. 1000 టికెట్ల విక్రయం**

**ప్రారంభమైన నిమిషాల్లోనే ఖాళీ**

**టికెట్ల కోసం ఎదురుచూసిన అభిమానులకు నిరాశ**



విశాఖపట్నం, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విశాఖపట్నంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్ల విక్రయాలు ప్రారంభమైన నిమిషాల్లోనే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. దీంతో టికెట్ల కోసం ఆశగా ఎదురుచూసిన అభిమానులకు నిరాశే మిగిలింది. విశాఖలో ఈ నెల 24న ఢిల్లీ–లక్నో, 30న ఢిల్లీ–హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఢిల్లీ–లక్నో మ్యాచ్ టికెట్ల విక్రయాలు నిన్న సాయంత్రం 4 గంటలకు డిస్ట్రిక్ట్ (జొమాటో) యాప్‌లో ప్రారంభమయ్యాయి. అప్పటికే టికెట్ల కోసం వేలాదిమంది అభిమానులు ఆన్‌లైన్‌లో వేచి చూస్తుండటంతో సేల్ ప్రారంభమైన నిమిషాల్లోనే రూ. 1000 టికెట్లు నిండుకున్నాయి. ఢిల్లీ–హైదరాబాద్ మ్యాచ్ టికెట్లు ఎప్పుడు విక్రయిస్తారన్న విషయాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. కాగా, గతేడాది మార్చి 31న జరిగిన ఢిల్లీ–చెన్నై మ్యచ్‌కు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. గతంలో నకిలీ టికెట్ల విక్రయాలు జోరుగా సాగాయని, ప్రస్తుతం అలాంటి ఘటనలు ఎవరి దృష్టికైనా వస్తే పోలీసులకు తెలియజేయాలని, లేదంటే తన వ్యక్తిగత వాట్సాప్ నంబర్ 79950 95799కు ఫిర్యాదులు పంపాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చీ తెలిపారు.

# అర్చక సేవ వైభవ రత్న అవార్డుకు

# ఎంపికైన విజయ జనార్ధనాచార్యులు




పిఠాపురం, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

లి పిఠాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీవేణుగోపాలస్వామి వార్ల ఆలయ ప్రధాన అర్చకులు విజయ జనార్ధనాచార్యులు గత 15 సంవత్సరాలుగా ఆలయ అభివృద్ధి ధార్మిక సేవ హిందూ సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పే విధంగా చేసిన సేవలకు గుర్తింపుగా సర్. సివి.రామన్ అకాడమి (సేవా సాంస్కృతిక సంస్థ) రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం నుండి ఈనెల 16 ఆదివారం హైదరాబాదులో జరిగే 33వ ఉగాది మహెూత్సవ వేడుకల్లో భాగంగా సువర్ణ ఘంటా కంకణ గోల్డ్ మెడల్ తో అర్చక సేవ వైభవరత్న అవార్డుకు ఎంపికైనట్లు సేవా సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు విజయ జనార్ధనచార్యులు మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి సమాజ సేవలకు సహకరిస్తున్న భక్తులకు మరియు దేవస్థానం సిబ్బందికి పిఠాపురం ప్రముఖులకు ఎలక్ట్రిక్ అండ్ ప్రింటు మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

# కురసాల కన్నబాబు

# మర్యాదపూర్వం కలిసిన దుర్గా రాణి

మండపేట, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు కాకినాడ రూరల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ ఆయన స్వగృహంలో కలసి దుశ్శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్సీపీ నాయకులు సాధనాల శివ భగవాన్ ఉన్నారు.

# వాడపల్లి వెంకన్న ఆలయానికి మరింత ఖ్యాతి తెస్తాం

**- భక్తులకు మెరుగైన సౌకర్యాలు**

**- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు**

**- కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు**



ఆత్రేయపురం, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి మరింత ఖ్యాతి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించి భక్తుల రద్దీ, వారికి కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆలయ మాడవీధులను శుభ్రం చేసారు. అలాగే వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తుల సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించారు. మజ్జిగ చలివేంద్రాలను పరిశీలించి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయంలో క్యూలైన్లను, స్వామి వారి సన్నిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన దీపారాధన ప్రాంగణాన్ని పరిశీలించి డీసీ చక్రధరరావుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనం చేయగా డీసీ చక్రధరరావు స్వామి వారి చిత్ర పటం అందజేసారు. ఎమ్మెల్యే సత్యానందరావు స్వామి వారి అన్న ప్రసాద భవనం వద్ద భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, దానికి తగినట్లుగా ఇక్కడ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి



ఏలూరు, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. శనివారం త్రాగునీరు, వడగాల్పులు, పదోతరగతి పరీక్షలు నిర్వహణ, పి-4 సర్వే తదితర అంశాలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు తదితరులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేసవిలో వడగాల్పులు, ఎండలు ఎక్కువగా ఉంటాయని విపత్తుల శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో త్రాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నీటిఎద్దటి లేకుండా మున్సిపల్ కమీషనర్లు, ఆర్ డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరమైన చోట చలివేంద్రాల ఏర్పాటుకు ఆయా ప్రాంతాలను గుర్తించాలన్నారు. కలెక్టరేట్ లో త్రాగునీటిని పరిక్షింపచేయాలని చలివేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే మూడు నెలలు ఎంతో కీలకమని, ముందే త్రాగునీటి సరఫరా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆర్ డబ్ల్యూఎస్, ఈవోపిఆర్డిలు తమ పరిధిలో ఉన్న త్రాగునీటి వనరులపై పూర్తి సమాచారం కలిగివుండాలన్నారు. త్రాగునీటి సరఫరాలపై ఎక్కడా ప్రతికూల వార్తలు రాకూడదని స్పష్టం చేశారు. వడగాల్పులను దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీ పిల్లలకు, విద్యార్ధుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ పిడి పి. శారద, డిఇఓ వెంకటలక్ష్మమ్మను కలెక్టర్ ఆదేశించారు. ఎండలో పిల్లలు ఉండకుండా ఆయా తరగతి గదుల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వడగాల్పులు, ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేయడంతోపాటు వడగాల్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇందుక సంబంధించి ప్రజలు చేయదగినవి, చేయకూడనివి అంశాల వారీగా క్షేత్రస్ధాయిలో అవగాహన పరచాలన్నారు. ముఖ్యంగా ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కార్మికులకు త్రాగునీరు, నీడను కల్పించే చర్యలు తీసుకోవాలని డ్వామా పిడి సుబ్బారావును కలెక్టర్ ఆదేశించారు. సిసి రోడ్లు, తదితర నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికులకు సచివాలయ సిబ్బంది, సర్వే విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించాలన్నారు. పర్యాటక ప్రాంతాలైన దేవాలయాలు, తదితరరాల వద్ద త్రాగునీటీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ అధికారులు కూడా ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వడగాల్పులకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుతీసుకనేలా సంబంధిత యాజమాన్యాలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం పి-4 సర్వేపై కలెక్టర్ సమీక్షిస్తూ సర్వేను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

**పదోతరగతి పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలి.**

జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించే పదోతరగతి పరీక్షలు సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తిచేయాలన్నారు. పేపరు లీకేజీలు వంటివి జరుగకుండా పటిష్ట భద్రతా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా వంటి ప్రచార మాధ్యమాల్లో వదంతులు వ్యాపించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో సెక్షన్-163 అమలు చేయడంతోపాటు పరీక్షల సమయంలో జీరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లు మూసివేసి ఉంచాలని ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్ధులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆర్ టి సి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆ సమయాలను , ప్రాంతాలను పత్రికా ముఖంగా తెలియజేయాలని ఆర్ టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి వరప్రసాద్ ను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మరి ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆశాఖ ఎస్ఇ సాల్మన్ రాజును కలెక్టర్ ఆదేశించారు.



## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం.

ఏలూరు, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధిద్దాం- ప్లాస్టిక్ వస్తువులను నివారిస్తూ పునర్వినియోగ వస్తువుల ప్రోత్సహానికి సంబంధించి అంశంపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య(చంటి), మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు స్వయంగా దుకాణాలకు వెళ్లి దుకాణాదారులకు,ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో ఆర్.ఆర్.పేట లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి జ్యూట్, క్లాత్ బ్యాగులను వినియోగపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడిచేయడానికి అపరాధరుసుం వేయవచ్చని కానీ మార్పు మనలో రావాలన్నారు. ప్రతిఒక్కరిలో ఈ విషయంపై చైతన్యం రావాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు బాటలు వేసినవారమవుతామన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, ఆర్డిఓ అచ్యుత్ అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, సెట్ వెల్ సిఇఓ ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ ఏ .భానుప్రతాప్, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, జున్నూరు కనక నరసింహరావు, పాము శ్యామ్యూల్, ఈదుపల్లి పవన్, పలువులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


## కలెక్టరేట్ లో స్వర్ణఆంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం.

ఏలూరు, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పర్యావరణ పరిరక్షణ లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పిలుపు ఇచ్చారు. స్ధానిక ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డి ఆర్ ఓ వి.విశ్వేశ్వరరావు , పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి. శ్రీలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిరాణి, పలువురు జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం ప్రహరీ గోడలకు సున్నం వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమాలలో భాగంగా ప్రతినెలా ఒక థీమ్ తో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మార్చి నెలలో సింగిల్ యాజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించే క్రమంలో అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహణా పనితీరు పై, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు నిర్వహిస్తుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు కార్యాలయాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## భీమవరం పచ్చని పరిశుభ్రంగా ఉండాలి..

**ఎమ్మెల్యే అంజిబాబుతో ముఖ్యమంత్రి చంద్రబాబు**



భీమవరం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పచ్చదనం .. పరిశుభ్రంగా భీమవరం ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం తణుకు పట్టణానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హెలీప్యాడ్ వద్ద భీమవరం ఎమ్మెల్యే రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు తో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. భీమవరం పచ్చని పరిశుభ్రంగా ఉండాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భీమవరం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పరిశుభ్రతే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు.

## రాబిన్ హుడ్ సినిమా ప్రేక్షకులకు

# భలేగా నచ్చేస్తుంది

**రాజమండ్రిలో సీన్ తీస్తే నా సినిమాహిట్టే**

**రాబిన్ హుడ్ కు ఆ సెంటిమెంటు పాటించాం**

**28న విడుదలవుతోంది మీడియాతో హీరో నితిన్**

**రాబిన్ హుడ్ చిత్ర ప్రమోషన్ కోసం రాజమండ్రి వచ్చిన హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల, దర్శకుడు వెంకీ కుడుముల**




రాజమహేంద్రవరం, మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తను హీరోగా నటించిన రాబిన్ హుడ్ చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఉన్నాయని,ఈ సినిమా అందరికీ భలేగా నచ్చేస్తుందని హీరో నితిన్ అన్నారు. గతంలో వెంకీ కుడుముల దర్శకత్వంలో తను నటించిన భీష్మ సినిమా మంచి విజయం సాధించిందని చెప్పారు.ఆ సినిమాలో ఒక సన్నివేశం రాజమండ్రిలో చిత్రీకరించామని అది హిట్టని అన్నారు.ఆ సెంటిమెంటుతో రాబిన్ హుడ్ సినిమా లో ఒక సీన్ ఇక్కడ చిత్రీకరించామని ఇది కూడా సూపర్ హిట్ అవుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.వెంకీ కుడుముల దర్శకత్వంలో హీరో నితిన్ హీరోయిన్ శ్రీ లీల నటించిన రాబిన్ హుడ్ చిత్రం ఈనెల 28 న విడుదల అవుతున్న సందర్భంగా చిత్ర ప్రమోషన్స్ కోసం రాజమండ్రి వచ్చిన నితిన్,శ్రీలీల,వెంకీ కుడుముల శనివారం మధ్యాహ్నం మంజీరా హోటల్ లో మీడియాతో మాట్లాడారు. హీరో నితిన్ మాట్లాడుతూ దర్శకుడు వెంకీ కుడుముల తొలి చిత్రం చలో నుంచి తనకు పరిచయం ఉందని తర్వాత తమ ఇద్దరి కాంబినేషన్లో వచ్చిన భీష్మ చిత్రం మంచి విజయం సాధించిందని గుర్తు చేశారు.ఈనెల 28 న విడుదల అవుతున్న రాబిన్ హుడ్ సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరించాలని నితిన్ కోరారు.దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ఇప్పటికే రాబిన్ హుడ్ టీజర్, సాంగ్స్ కు మంచి స్పందన వస్తోందని సినిమా కూడా హిట్టవుతుందన్న నమ్మకం ఉందని చెప్పారు.నితిన్ యాక్షన్ సీన్లు,ఫన్ అందరినీ అలరిస్తాయని, సినిమాలో సర్ప్రైజ్ ట్విస్టులు కూడా ఉన్నాయని తెలిపారు.సంగీత దర్శకుడు జి.వి.ప్రకాష్ మంచి పాటలు కంపోజ్ చేశారని చెప్పారు.శ్రీలీల గత చిత్రాలలో ఆమె డ్యాన్స్ మాత్రమే చూశారని,ఈ చిత్రంలో డ్యాన్స్ తో పాటు శ్రీలీల అద్భుతమైన ఫెర్మార్మె న్స్ చూస్తారని వెంకీ కుడుముల చెప్పారు.తమ సెంటిమెంటు ప్రకారం రాబిన్ హుడ్ సినిమా కోసం రాజమండ్రి గోదావరి వద్ద సీన్లు తీశామని నవ్వుతూ చెప్పారు.ఇది కూడా పెద్ద హిట్టవుతుందని అన్నారు.హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ తనకు రాజమండ్రి కొత్తకాదని తమ గ్రాండ్ ఫాదర్ ధవళేశ్వరంలో ఉండేవారని చెప్పారు.ఈ సినిమాలో పాత్ర తనకు చాలా నచ్చిన కేరక్టర్ అని అన్నారు.నా క్యారెక్టర్ ను ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారని,పిల్లలతో కలిసి ఈ సినిమా చూడాలని ఆమె కోరారు.రాజమండ్రి రోజ్ మిల్క్ తనకు చాలా ఇష్టమని శ్రీలీల చెప్పింది.

# అభివృద్ధి అనేది విద్యతోనే సాధ్యం

**ఎస్ఆర్ కేఆర్ కళాశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అంజిబాబు**




భీమవరం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కిలో బియ్యం ఇస్తే ఆకలి తీరుతుందని, ఇళ్ళు ఇస్తే నిడ వస్తుందని, అదే విద్యను అందిస్తే అభివృద్ధికి సూత్రదారుడు అవుతాడని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. యువత వల్లే అభివృద్ధి సాధ్యమవుతుందని, అభివృద్ది అనేది విద్య వల్లే సాధ్యమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరం ఎస్ఆర్ కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 45వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు అవకాశాలు మెండుగా ఉన్నాయని, రానున్న రోజులన్ని యువత కేనని అన్నారు. చరిత్ర ఉన్నంత వరకు ఎస్ఆర్ కేఆర్ పేరు అలానే ఉంటుందని, 1980 లో 3 బ్రాంచ్ లతో ప్రారంభమై నేడు 12 బ్రాంచ్ లతో 8 వేల మంది విద్యార్థులు, 1000 స్టాఫ్ తో ఒక వెలుగు తీసుకుని వచ్చిందన్నారు. ఈ కళాశాల లో సీట్ లభించడం ఎంతో అరుదని, ఇక్కడ చదివితే ఉద్యోగం ఖచ్చితంగా వస్తుందన్నారు. విద్యా అభివృద్ధికి ఈ కళాశాల ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. కళాశాల ప్రెసిడెంట్ సాగి ప్రసాద్ రాజు, సెక్రటరి సాగి నిషాంత్ వర్మ, డైరెక్టర్ జగపతి రాజు, ప్రిన్సిపాల్ కెవి మురళీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

## ఉత్తమ క్లబ్ అవార్డులు అందుకున్న భీమవరం లయన్స్ క్లబ్




భీమవరం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరం లయన్స్ క్లబ్ ఉత్తమ క్లబ్ అవార్డును అందుకుంది. తాడేపల్లిగూడెం లయన్స్ గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు అధ్యక్షతన జరిగిన సేవా అవార్డ్స్ కార్యక్రమంలో క్లబ్ అవార్డులను అందుకున్నారు. జిల్లాలో ఉత్తమ కార్యదర్శి బొండా రాంబాబు, ఉత్తమ కోశాధికారి కోట్ల నాని, ఉత్తమ క్లబ్ గా భీమవరం అధ్యక్షులు లయన్ మహేష్ లుగా అవార్డులను హైకోర్ట్ మాజీ న్యాయమూర్తులు ఆకుల శేషసాయి, మాజీ సిఐడి మాజీ ఆఫీసర్ లక్ష్మీనారాయణ చేతులమీదుగా స్వీకరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ లయన్స్ క్లబ్స్ డైరెక్టర్ విజయ కుమార్ రాజు, లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుగోపాల్, పలువురు మాజీ లయన్స్ జిల్లా గవర్నర్స్ పాల్గొన్నారు. వబిలిశెట్టి కనకరాజు, సి కృష్ణంరాజు, విశ్వనాథరాజు, చైతన్య భారతి అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, ధార్మిక పరిషత్ మాజీ సభ్యులు మంతెన రామ్ కుమార్ రాజు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, శోభన్ బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఓలేటి శ్రీనివాస్, కోట్ల ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

# 2000 పెన్నులు, పేడ్స్‌తో అమ్మవారికి అలంకరణ

## పదో తరగతి విద్యార్ధులకు పెన్నులు, పేడ్స్ పంపిణీ





భీమవరం మార్చి 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పదో తరగతి పరీక్షలు సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారికి 2000 పెన్నులు, పేడ్స్ తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలలో భాగంగా శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలు గొల్లపల్లి శ్యామ్ వెంకట త్రియాన్స్ దంపతులు, వి అస్త్రిత్, శ్రీసత్యభాను, యర్రా సురేష్ దంపతులు, కాకులపాటి భానుమూర్తి దంపతులు, బస్వ రుద్రరావు దంపతులు, బండి సీతారామ స్వామి దంపతులు, చొడపనీడి కిషోర్ దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పెన్నులు, పేడ్స్ తో అలంకరణ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్ధులకు పెన్నులను పేడ్స్ అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# బుమ్రాను జడ్జ్ చేయడంలో ఘోరంగా విఫలమయ్యా

## ఆసీస్ క్రికెటర్

**గతేడాది జరిగిన బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా టాప్ వికెట్ టేకర్‌గా నిలిచినా సిరీస్‌ను మాత్రం ఆసీస్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ జట్టు ఓపెనర్ నాథన్ మెక్‌స్వీనేని మూడు టెస్టుల్లో 4 సార్లు బుమ్రానే ఔట్ చేశాడు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో బుమ్రాపై ప్రశంసల వర్షం కురిపించిన మెక్‌స్వీనీ.. భారత పేసర్‌ను అర్థం చేసుకోవడంలో ఘోరంగా విఫలమైనట్లు పేర్కొన్నాడు.**



"బీజీటీలో మాకు బుమ్రా నుంచి చాలా సవాల్ ఎదురైంది. అతడొక అద్భుతమైన బౌలర్. నేను అతడి బౌలింగ్‌ను అర్థం చేసుకోవడంలో ఘోరంగా విఫలమయ్యా. అంతకుముందు ఎప్పుడూ బుమ్రాను ఎదుర్కోకపోవడమూ దీనికి కారణం. బంతిని సరైన ప్రాంతంలో సంధిస్తే ఫలితం ఎలా వస్తుందో అతడి బౌలింగ్‌ను చూస్తే అర్థమైపోతుంది. కేవలం నేనొక్కడిని మాత్రమే కాదు.. మా జట్టులోని ఇతర ఆటగాళ్లూ బుమ్రాపై ఆధిక్యం ప్రదర్శించలేకపోయారు. నాకు అదికాస్త ఆత్మవిశ్వాసం ఇచ్చింది. నన్ను మాత్రమే కాకుండా జట్టునంతా అతడు టార్గెట్ చేశాడు" అని మెక్‌స్వీనే వ్యాఖ్యానించాడు.

### సంజనా స్పెషల్ పోస్టు..

జస్‌ప్రీత్ బుమ్రా, క్రికెట్ వ్యాఖ్యాత సంజనా గణేశన్ నాలుగో వివాహ వార్షికోత్సవం ఇవాళ. ఈక్రమంలో సంజనా సోషల్ మీడియా వేదికగా పోస్టు షేర్ చేసింది. "నువ్వు ఉంటే నా గుండె కొట్టుకుంటుంది. నువ్వు ఉంటే ఊపిరి పీల్చుకోగలను. నువ్వు లేకపోతే ఇంట్లో ఉన్నట్లు కూడా అనిపించదు. నువ్వుంటే భయమే ఉండదు" అని వ్యాఖ్యలను జోడించింది. సంజనా గణేశన్‌ను బుమ్రా 2021లో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికీ 2023లో కుమారుడు అంగద్ జన్మించాడు.

# ప్రతిఒక్కరినీ సమానంగా చూస్తాం: ఆర్సీబీ కోచ్ డీకే

**భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ సరికొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమైపోయాడు. మొన్నటివరకు ఆ జట్టులో ఆటగాడిగా కొనసాగిన దినేశ్ కార్తిక్.. ఇక నుంచి కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రధాన కోచ్‌గా డీకే వచ్చాడు. ఈ క్రమంలో తమ జట్టు ప్రదర్శనపై ఓ ఆంగ్ల ఛానల్‌తో డీకే ప్రత్యేకంగా మాట్లాడాడు. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఆర్సీబీ విజేతగా నిలవలేకపోయింది. యువ ఆటగాడు రజత్ పటీదార్‌కు నాయకత్వం అప్పగించిన సంగతి తెలిసిందే.**

### ఈ సారైనా... ఆర్సీబీ తలరాత మారేనా!

"ప్లేయర్‌గా జట్టులో ఎవరిదైనా లగ్జరీ లైఫ్‌స్టైల్. సాయం చేయడానికి చుట్టూ ఉంటారు. అదే కోచ్‌గా ఉంటే మాత్రం మనమే సెల్ఫ్ సర్వీస్ చేసుకోవాలి. అక్కడున్న వారికీ సర్వ్ చేయాలి. నేను ఇప్పుడు ఆ బాధ్యతల్లోకి వచ్చా. ఇప్పటివరకు నేను చేసిన వాటికి భిన్నమైన పాత్ర ఇది. మెగా వేలం నుంచే జట్టుకు సంబంధించి సన్నద్ధతపై అవగాహన తెచ్చుకున్నా. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంపై దృష్టిసారించా. ఇప్పుడీ జట్టును చూస్తుంటే బాగుంది. పేపర్ మీద ఇతర జట్లూ మంచిగానే కనిపిస్తున్నాయి. అయితే, మైదానంలో ఎవరు బాగా ఆడితే వారిదే విజయం. ఆర్సీబీలో స్వదేశీ, విదేశీ ప్లేయర్లందరినీ సమానంగా చూస్తాం. క్లిష్ట పరిస్థితుల్లో వారు ఎలాంటి పాత్ర పోషించాలనేది చెబుతాం" అని డీకే వెల్లడించాడు.



### ఒలింపిక్స్ నిర్వహణ అంశంపై..

"ఇప్పుడు భారత్ సూపర్ పవర్‌గా ఎదుగుతోంది. ఆర్థికంగానూ వేగంగా వృద్ధి చెందుతోన్న దేశం. దేశంలోకి భారీగా ఎంఎన్‌సీలు వచ్చాయి. పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందడానికి కావాల్సినంత భూమి, వసతులు మనకున్నాయి. ఇప్పుడు క్రీడలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. గతంలో మౌలిక వసతులు కూడా సరిగ్గా ఉండేవి కావు. ఇప్పుడు మాత్రం ప్రతి క్రీడకు తగినట్లుగా మౌలిక సదుపాయాల్లో మార్పులు వచ్చాయి. ఒలింపిక్స్ 2036 నిర్వహణ కోసం మనమంతా సిద్ధమని భావిస్తున్నా" అని డీకే తెలిపాడు.

# పాకిస్తాన్ ఆటగాళ్లకు రూ. 33 లక్షల జరిమానా విధించిన పీసీబీ..



**ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో అవమానకరమైన ఓటమి తర్వాత, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా ఇప్పుడు వారు గతంలో చేసిన తప్పులకు జరిమానా విధిస్తోంది. దీని ద్వారా పీసీబీ మొత్తం రూ.33 లక్షలు జరిమానా వసూలు చేసింది.**

ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తన ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంది. మొదటి అడుగుగా, దేశీయ టోర్నమెంట్లలో ఆడే ఆటగాళ్ల జీతాలను తగ్గించింది. ఆ తర్వాత, జాతీయ జట్టు ఆటగాళ్లకు ఇప్పుడు జరిమానా విధించడంతో, పీసీబీ మరోసారి వార్తల్లో చర్చనీయాంశంగా మారింది.

### రూ. 33 లక్షల జరిమానా..

పాకిస్తాన్ మీడియా నివేదికల ప్రకారం, 2024 అక్టోబర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన ముల్తాన్ టెస్ట్ నుంచి దక్షిణాఫ్రికా సిరీస్ వరకు, పీసీబీ పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఆటగాళ్లకు రూ.33 లక్షల జరిమానా విధించింది.

పాకిస్తాన్ జట్టు యువ ఓపెనర్ సైమ్ అయూబ్, వైస్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా అబ్దుల్లా షఫీక్ లకు చెరో 5 లక్షల రూపాయల జరిమానా విధించారు. దీనికి ప్రధాన కారణం క్రమశిక్షణ లేని ప్రవర్తన అని తెలుస్తోంది. ఆస్ట్రేలియా సిరీస్ సందర్భంగా ఈ ముగ్గురు ఆటగాళ్ళు రాత్రి ఆలస్యంగా హోటల్‌కు చేరుకున్నారు. ఇందుకోసం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఈ ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.5 లక్షలు జరిమానా విధించారు. అదేవిధంగా, దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్ సమయంలో, కొంతమంది ఆటగాళ్ళు రాత్రి 2 నిమిషాలు ఆలస్యంగా హోటల్‌కు చేరుకున్నారు. ఆ విధంగా, సుఫ్యాన్ ముఖిమ్, ఉస్మాన్ ఖాన్, అబ్బాస్ అఫ్రిదిలకు రూ. 18,000 జరిమానా విధించింది.

### ఖైదీ సంఖ్యకు జరిమానా..

పాకిస్తాన్ జట్టు ఫాస్ట్ బౌలర్ అమీర్ జమాల్ పై కూడా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంది. ఆస్ట్రేలియా టెస్ట్ సిరీస్ సందర్భంగా అమీర్ జమాల్ 'ఖైదీ నంబర్ 804' అని రాసిన టోపీని ధరించాడు. జైలులో ఉన్న పాకిస్తాన్ జట్టు మాజీ కెప్టెన్, ఆ దేశ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు మద్దతు ఇచ్చాడు. ఇందుకోసం అమీర్ జమాల్‌కు భారీ మొత్తంలో రూ. 14 లక్షలు జరిమానా విధించారు. మొత్తం మీద, ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభమైనప్పటి నుంచి ఏదో ఒక కారణంతో వార్తల్లో నిలిచిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఇప్పుడు జీతాల కోతలు, జరిమానాలతో వార్తల్లో నిలుస్తోంది.

# యువ క్రికెటర్ నుంచి సారథిగా మారడంలో ద్రవిడ్‌దే కీలక పాత్ర: సంజు శాంసన్

వరుసగా ఐదో ఏడాది రాజస్థాన్ రాయల్స్‌ను నడిపించేందుకు సంజు శాంసన్ సిద్ధమయ్యాడు. భారత మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ మళ్లీ రాజస్థాన్‌కు మెంటార్‌గా వచ్చాడు. కాలికి గాయమైనా సరే ద్రవిడ్ జట్టు శిబిరానికి వచ్చాడు. ఆటగాళ్ల ప్రాక్టీస్‌ను దగ్గర్నుంచి గమనించాడు. సంజు శాంసన్ రాజస్థాన్ జట్టులోకి (2013-15) వచ్చినప్పుడు కూడా ద్రవిడ్ కెప్టెన్‌గా ఉన్నాడు. యువ క్రికెటర్‌గా ఉన్న తనను ద్రవిడ్ ఎంతో ప్రోత్సహించినట్లు సంజు గుర్తుచేసుకున్నాడు. తర్వాత రెండు సీజన్లు దిల్లీకి ఆడినప్పటికీ.. 2018 నుంచి రాజస్థాన్‌కే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. "జీవితంలో చాలా విషయాలు ఫన్నీగా జరిగిపోతుంటాయి. నా కెరీర్‌లోనూ అలాంటిది జరిగింది. నేను తొలిసారి ఐపీఎల్ (%ళూూ%)లోకి వచ్చినప్పుడు రాహుల్ ద్రవిడ్ నన్ను పరీక్షించారు. అప్పుడు ద్రవిడ్ కెప్టెన్. ఆటగాళ్లకు మద్దతుగా నిలిచే సారథి. యువకులను ప్రోత్సహిస్తాడు. శిక్షణ శిబిరంలో నన్ను పరిశీలించిన ద్రవిడ్ 'ఓకే. మా జట్టుకు ఆడతావా?' అని అడిగాడు. అప్పట్నుంచి ఇప్పటివరకు నాకు ఇది నమ్మకశక్యం కానిదిగానే ఉంది. ఇప్పుడు నేను కెప్టెన్. రాహుల్ సర్ చాలా ఏళ్ల తర్వాత మా జట్టుకు కోచ్‌గా వచ్చారు. నిజంగా నాకు ఇది ప్రత్యేకమైన అనుభూతి. రాజస్థాన్ రాయల్స్ కుటుంబంలో ద్రవిడ్ ఎప్పుడూ భాగమే. ఆయన మళ్లీ రావడం చాలా ఆనందంగా ఉంది. ద్రవిడ్ నాయకత్వంలో రాజస్థాన్‌కు ఆడా. కోచింగ్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఇప్పుడు నేను సారథిగా ఉండగా ఆయన కోచ్‌గా వచ్చారు. చాలా విషయాలను నేర్చుకొనే అవకాశం నాకు వచ్చింది" అని సంజు తెలిపాడు. "కేవలం మైదానంలోనే ద్రవిడ్ నైపుణ్యాలను చూడటమే కాకుండా.. ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని చూశా. అప్పుడు కెప్టెన్‌గా ఒక్క ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌ను కూడా మిస్ కాలేదు. ఇప్పుడు కూడా అంతే. డ్రెస్సింగ్ రూమ్‌లో కుర్రాళ్లతో ఎలా ఉంటాడనేది నేను దగ్గర్నుంచి చూశా.

# ఐపీఎల్ చరిత్రలో 5 అతిపెద్ద వివాదాలు

**ఐపీఎల్ ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలోనే అతిపెద్ద లీగ్‌గా మారింది. అందుకే ప్రతి ఆటగాడు ఐపీఎల్ ఆడాలని కలలు కంటాడు. దీనిలో చాలా మంది తెలియని క్రికెటర్లు రాత్రికి రాత్రే స్టార్లుగా మారి, ఆపై వారికి ప్రత్యేక అభిమానుల ఫాలోయింగ్ ఏర్పడుతుంది. ఇందులో మయాంక్ యాదవ్, రింకు సింగ్, నితీష్ రెడ్డి వంటి చాలా మంది యువ ముఖాలు ఇటీవల తమ జట్టుకు స్టార్లుగా మారారు. కానీ, ఐపీఎల్ సమయంలో మైదానంలో ఉద్రిక్త వాతావరణం ఉంటుంది. అన్ని ఫ్రాంచైజీల ఆటగాళ్లు టైటిల్ గెలవాలనే ఒత్తిడిలో ఉంటారు. దీని కారణంగా ఈ లీగ్‌లో అనేక వివాదాలు తలెత్తాయి. ఇటువంటి పరిస్థితిలో, ఇప్పటివరకు ఐపీఎల్ చరిత్రలో జరిగిన ఐదు అతిపెద్ద వివాదాలను ఇప్పుడు తెలుసుకుందాం.**



### 1. హర్భజన్ సింగ్, శ్రీశాంత్ చెంపదెబ్బ సంఘటన..

ఐపీఎల్ 2013 కూడా చాలా గ్రాండ్‌గా ప్రారంభమైంది. ప్రారంభమైన 12వ రోజున, మైదానంలో ఒక పెద్ద సంఘటన చోటు చేసుకుంది. నిజానికి ముంబై ఇండియన్స్ జట్టు పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఆ తర్వాత, శ్రీశాంత్ హర్భజన్ సింగ్‌ను 'దురదృష్టవంతుడు' అంటూ పిలిచాడు. దీంతో భజ్జీ కోపంతో మైదానం మధ్యలో శ్రీశాంత్‌ను చెంపదెబ్బ కొట్టాడు. ఆ తర్వాత శ్రీశాంత్ ఏడుస్తూ కనిపించాడు. దీంతో ఇషఉ్య తీవ్రమైంది. ఈ చర్య కారణంగా భజ్జీపై సీజన్ మొత్తం నిషేధం విధించారు. అయితే, బీసీసీఐ అతన్ని ఐదు వన్డే మ్యాచ్‌ల నుంచి కూడా మినహాయించింది.

### 2. ఐపీఎల్ ఫిక్సింగ్, బెట్టింగ్ కుంభకోణం..

ఐపీఎల్ చరిత్రలో, ఈ లీగ్‌పై 2013 సంవత్సరంలో అతిపెద్ద కళంకం ఏర్పడింది. స్పాట్ ఫిక్సింగ్ కేసులో రాజస్థాన్ రాయల్స్‌కు చెందిన ముగ్గురు ఆటగాళ్ళు శ్రీశాంత్, అంకిత్ చవాన్, అజిత్ చండిలా పేర్లు బయటకు వచ్చినప్పుడు, ఆ ఆటగాళ్లపై బీసీసీఐ జీవితాంతం నిషేధం విధించింది. ఇది కాకుండా, బెట్టింగ్ కేసులో, చెన్నై యజమాని ఎన్ శ్రీనివాసన్ అల్లుడు గురునాథ్ మెయ్యప్పన్, రాజస్థాన్ యజమాని రాజ్ కుంద్రాను బీసీసీఐ దోషులుగా నిర్ధారించింది. దీని కారణంగా రాజస్థాన్, చెన్నై జట్లపై రెండేళ్లు (2016-2017) నిషేధం విధించింది.

### 3. రవీంద్ర జడేజాపై ఏడాది నిషేధం..

ఐపీఎల్‌లో, ఫ్రాంచైజీలు తమ జట్టు తరపున ఆడటానికి ఆటగాళ్లకు భారీ మొత్తంలో డబ్బు ఇస్తుంటాయి. భారత స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఈ ఉచ్చులో చిక్కుకున్నాడు. అతను రాజస్థాన్ రాయల్స్ జట్టులో





భాగమైనప్పుడు, ఎవరికీ తెలియజేయకుండా ముంబై ఇండియన్స్‌లో చేరడానికి ఒప్పందంపై సంతకం చేశాడు. దీంతో జడేజా ఒక సంవత్సరం పాటు నిషేధానికి గురయ్యాడు. 2011లో కొచ్చి టస్కర్స్ కేరళలో చేరిన తర్వాత, అతను మళ్ళీ చెన్నై సూపర్ కింగ్స్‌లో భాగమయ్యాడు.

### 4. కోహ్లి, గంభీర్ మధ్య వాగ్వాదం..

ఐపీఎల్‌లో టీం ఇండియా ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి మధ్య కూడా గొడవ జరిగింది. ఐపీఎల్‌లో కేకేఆర్, ఆర్‌సీబీ మధ్య జరిగిన మ్యాచ్‌లో, కోహ్లి రాంగ్ షాట్ ఆడి ఔట్ అయ్యాడు. గంభీర్ అతనితో ఏదో అన్నాడు, ఆ తర్వాత ఇద్దరు ఆటగాళ్ల మధ్య చాలా వాడీవేడీ మాటల యుద్ధం కనిపించింది. మైదానంలో ఉన్న ఇతర ఆటగాళు ఇద్దరినీ విడదీసే సమయానికి, విషయాలు చాలా దూరం వెళ్ళాయి.

### 5. ఐపీఎల్ వ్యవస్థాపకుడిపై బహిష్కరణ..

భారతదేశంలో ఐపీఎల్‌కు జన్మనిచ్చిన లలిత్ మోడీని 3 సీజన్ల తర్వాత లీగ్ నుంచి బయటకు పంపించారు. ఐపీఎల్ ఆర్థిక విషయాల్లో లలిత్ మోడీ చాలా అవకతవకలు చేశాడు. దీని కారణంగా అతనికి లీగ్ నుంచి నిష్క్రమించే మార్గం చూపించారు. రాజస్థాన్ రాయల్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్ల అనుమానాస్పద వేలం, సోనీతో ప్రసార ఒప్పందంలో అవకతవకలు వంటి 5 ప్రధాన కేసుల్లో లలిత్ మోడీ నిందితుడిగా పరిగణించారు. ఆ తరువాత అతను ఇప్పుడు ఈ లీగ్‌కు దూరంగా ఉన్నాడు.





# అందాల పూజ ఎర్ర గులాబీ

టాలీవుడ్‌లో ఒక లైలా కోసం, ముకుంద సినిమాలతో అడుగు పెట్టిన పూజా హెగ్డే పెద్దగా గుర్తింపు సొంతం చేసుకోలేక పోయింది. ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోక పోవడంతో బాలీవుడ్‌కి వెళ్లింది. అక్కడ మొహెంజదారో సినిమాలో నటించింది. ఆ సినిమా తర్వాత మళ్లీ టాలీవుడ్‌లో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన దువ్వాడ జగన్నాథం సినిమాలో నటించింది. ఆ సినిమాలో పూజా హెగ్డే గ్లామర్‌తో మెప్పించింది. అంతే కాకుండా నటనతో సరికొత్తగా కనిపించింది. అందుకే టాలీవుడ్‌లో దువ్వాడ జగన్నాథం తర్వాత వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం రాలేదు. దాదాపుగా ఐదేళ్ల పాటు టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా సినిమాలు చేసింది. పూజా హెగ్డే తక్కువ సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరోలు అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, మహేష్ బాబు, వరుణ్ తేజ్, అఖిల్‌లతో వర్క్ చేసే అవకాశాలు దక్కించుకుంది. ఆ క్రమంలో భారీ విజయాలను కూడా సొంతం చేసుకుంది. కానీ ఈమధ్య కాలంలో పూజా హెగ్డేకి కాలం కలిసి రావడం లేదు. ఆమె నటించిన ఏ ఒక్క సినిమా బాక్సాఫీస్ వద్ద ఆడలేదు. దాంతో గత రెండు సంవత్సరాలుగా టాలీవుడ్‌కి దూరంగా ఉంది. ముఖ్యంగా ప్రభాస్‌తో నటించిన రాధేశ్యామ్ సినిమా తర్వాత పూజా హెగ్డే ఇండస్ట్రీలో కనిపించకుండా పోయింది. ప్రస్తుతం బాలీవుడ్, కోలీవుడ్‌లో సినిమాలు చేస్తున్న ఈమె అక్కడ హిట్ కోసం ప్రయత్నాలు చేస్తుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా పూజా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా పూజా హెగ్డే రెడ్ డ్రెస్‌లో విభిన్నమైన లుక్‌తో ఆకట్టుకుంది. ఎర్ర గులాబీలతో తయారు చేసిన అందమైన డ్రెస్‌ను ధరించినట్లుగా పూజా హెగ్డే ఔట్ ఫిట్ ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి లుక్‌తో పూజా హెగ్డే సర్‌ప్రైజ్ చేసింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే పూజా హెగ్డే చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతటి అందం ఉన్న పూజా హెగ్డేను అప్పుడే టాలీవుడ్ పక్కన పెట్టడం బాధగా ఉందని, త్వరలో ఆమె తిరిగి టాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. బాలీవుడ్‌లో ఇటీవల దేవ సినిమాతో వచ్చి నిరాశ పరిచింది. అక్కడ దేవ హిట్ అయితే కచ్చితంగా మంచి ఫ్యూచర్ ఉంటుందని అనుకున్నారు. కానీ దేవ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. అందుకే హిట్ కోసం మరో సినిమా వచ్చే వరకు ఈ అమ్మడు వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈ అమ్మడు రెండు సినిమాలు చేస్తుంది. మరో వైపు తమిళ్‌లోనూ ఈమె సినిమాలు చేస్తుంది. ముఖ్యంగా తమిళ్‌లో ఈమె సూర్యతో కలిసి చేస్తున్న రెట్రో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. రెట్రో సినిమాకు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా హిట్ అయితే తమిళ్‌లో రెండు మూడు ఏళ్ల పాటు బిజీగా ఉండే అవకాశాలు ఉంటాయి. రెట్రో మాత్రమే కాకుండా సూపర్ స్టార్ రజనీకాంత్ కూలీ సినిమాలో ఈమె ఐటెం సాంగ్‌లో కనిపించబోతుంది. ఇక లారెన్స్ సినిమా కాంచన 4 లోనూ ఈమెను ఎంపిక చేశారనే వార్తలు వచ్చాయి. ఇక సూపర్ స్టార్ విజయ్‌తో చేస్తున్న జన నాయగన్ సినిమా విడుదలకు సిద్ధం అవుతుంది. తమిళ్‌లో ఈమె ఏకంగా నాలుగు సినిమాలు చేస్తున్న నేపథ్యంలో రెండు హిట్ అయినా కచ్చితంగా మంచి బ్రేక్ దక్కే అవకాశాలు ఉన్నాయి. తద్వారా ఇండస్ట్రీలో మరో నాలుగు ఏళ్ల పాటు కొనసాగే అవకాశాలు ఉంటాయని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# కోర్ట్' సినిమాలో మనసు దోచుకున్న శ్రీదేవి

**తెలుగు సినీ ఇండస్ట్రీకి కొత్త టాలెంట్**

సినిమా ఇండస్ట్రీలో ప్రతీ రోజూ కొత్త ముఖాలు పరిచయం అవుతూనే ఉంటాయి. అయితే అందరికీ ఒకేలా గుర్తింపు రావడం మాత్రం కష్టమే. కానీ 'కోర్ట్' సినిమా ద్వారా ప్రేక్షకుల మనసులను దోచుకున్న శ్రీదేవి, తన సహజమైన నటనతో సినీ ప్రపంచంలో తన ప్రత్యేకతను నిరూపించుకుంది.



**'కోర్ట్'లో శ్రీదేవి నటనకు ప్రేక్షకులు ఫిదా**

కాకినాడకు చెందిన శ్రీదేవి ఈ సినిమా ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైంది. 'కోర్ట్' చూసిన ప్రతి ఒక్కరు ఈ అమ్మాయి నటనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అందుకు కారణం ఆమె నటనలో సహజత్వం. సినిమా హాల్‌లో ప్రేక్షకులు ఒక్కసారిగా ఈ అమ్మాయిని అభిమానించే స్థాయికి చేరుకుంది.

**కెరీర్ ప్రారంభం - చిన్న పాత్రల నుండి మెయిన్ రోల్ వరకు**

శ్రీదేవి గతంలో ఒకటి రెండు సినిమాల్లో చిన్న పాత్రలు చేసినప్పటికీ, అవి పెద్దగా గుర్తింపును తెచ్చిపెట్టలేదు. ఈ విషయాన్ని ఇంటర్వ్యూలలో స్వయంగా వెల్లడించింది. కాకినాడలో ఇంటర్ చదువుకుంటూనే రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో ఆకర్షణీయంగా మారిన ఆమెకు ఈ సినిమా ద్వారా గొప్ప అవకాశం లభించింది. అయితే, ఆ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుని, 'జాబిల్లి' పాత్రలో తన అసాధారణమైన అభినయాన్ని ప్రదర్శించింది. అనుభవజ్ఞులైన నటీనటుల స్థాయిలో హావభావాలను పలికించి, తన నటనతో ప్రత్యేకమైన ముద్ర వేసింది.

**సినిమాలో హైలైట్ అయిన కొన్ని సన్నివేశాలు**

బ్యాగులో ఫోన్ లిఫ్ట్ చేస్తూ దొరికిపోయే సీన్ – ఈ సన్నివేశంలో ఆమె చూపించిన భయభ్రాంతులు ప్రేక్షకుల హృదయాలను తాకాయి. తల్లిని హత్తుకునే సీన్ – ఎలాంటి ఆవేశం లేకుండా ఎమోషనల్‌గా నటించిన విధానం అందరినీ కదిలించింది. కోర్ట్ సీన్ – కోర్ట్‌లో తన ప్రియమైన వ్యక్తిని చూసినప్పుడల్లా చూపిన ఎమోషన్ అద్భుతంగా ఉంది.
క్లైమాక్స్ %–% చివర్లో ఆమె నటనను చూసి ప్రేక్షకులు అప్రతిమమైన అనుభూతిని పొందారు.

**మలయాళ నటనను తలపించే శ్రీదేవి పెర్ఫార్మెన్స్**


మలయాళ సినిమాల్లో సహజత్వానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు, అలాంటి రియలిస్టిక్ నటనను తెలుగు తెరపై ప్రదర్శించడం అరుదు. అయితే, శ్రీదేవి తన తొలి చిత్రంతోనే అలాంటి అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చి అందరినీ ఆకట్టుకుంది. 'కోర్ట్' సినిమా కథ, స్క్రీన్ ప్లే, సంగీతం పరంగా మెప్పించడంతో పాటు, నటన విషయంలో శ్రీదేవి ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించింది. శివాజీ, ప్రియదర్శి తరువాత ప్రేక్షకుల దృష్టిని ఎక్కువగా ఆకర్షించినది ఆమెనే. కాకినాడలో పెరిగిన ఓ సాధారణ అమ్మాయి ఇంత బాగా నటించిందా అని ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతున్నారు. అంజలి, స్వాతి, ఆనంది తరహాలో శ్రీదేవి కూడా త్వరలో స్టార్ హీరోయిన్ గా నిలుస్తుందేమో చూడాలి.

**శ్రీదేవికి ముందు నిలిచిన ఛాలెంజ్**


ఈ సినిమా తర్వాత శ్రీదేవికి మరిన్ని అవకాశాలు వస్తాయని సందేహమే లేదు. కానీ ఆ అవకాశాలను ఎలా ఉపయోగించుకుంటుందనేది చూడాలి. అంజలి, స్వాతి, ఆనంది లాంటి సహజ నటులతో సమానంగా శ్రీదేవి పేరు నిలుస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.

**భవిష్యత్తులో శ్రీదేవి ప్రయాణం**

'కోర్ట్' తర్వాత శ్రీదేవి కెరీర్‌లో కొత్త మలుపు తిరగనుంది. తెలుగు ప్రేక్షకులకు మరో సహజమైన నటి లభించిందని చెప్పొచ్చు. ఈ అమ్మాయి మరిన్ని హిట్ సినిమాలతో ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటుందని ఆశిద్దాం.



# మెక్సికోలో హాయిగా ఎంజాయ్ చేస్తున్న నాగచైతన్య దంపతులు



ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారిన జంట నాగ చైతన్య – శోభిత. సమంత నుంచి విడిపోయిన తర్వాత నాగ చైతన్య తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. కొంతకాలం శోభితతో ప్రేమలో ఉన్న నాగ చైతన్య, గత ఏడాది ఆమెను వివాహం చేసుకుని జీవిత ప్రయాణాన్ని ప్రారంభించాడు. పెళ్లి అయినప్పటి నుంచి ఈ జంట ప్రతి క్షణాన్ని ఆనందంగా గడుపుతూ, హ్యాపీ కపుల్‌గా ట్రెండ్ అవుతోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శోభిత, తన ప్రేమ జీవితానికి సంబంధించిన అనేక మధుర క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. వీరిద్దరూ విదేశీ ట్రిప్‌లకు వెళ్లినప్పుడో, రొమాంటిక్ డిన్నర్ డేట్‌లను ఎంజాయ్ చేసినప్పుడో తీసుకున్న ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇటీవలే ఈ జంట యూరప్ ట్రిప్‌ను ఎంజాయ్ చేసింది. తాజాగా రేసింగ్ ట్రాక్‌పై సందడి చేసిన వీరి ఫోటోలు అభిమానులను ఆకట్టుకున్నాయి. నాగ చైతన్యకి రేసింగ్ అంటే ఎంతగానో ఇష్టం, అందుకే తన జీవిత భాగస్వామిని కూడా రేసింగ్ అనుభవం చూపించేందుకు తీసుకెళ్లాడు. ప్రత్యేకంగా తన ఇష్టమైన కారులో శోభితను కూర్చోబెట్టి అందమైన ఫోటోలు దిగాడు. అక్కినేని ఫ్యాన్స్ ఈ జంటను చూసి ముచ్చట పడుతూ, "క్యూట్ కపుల్" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

**వైరల్ అయిన ఈ జంట హాలిడే ట్రిప్స్**

నాగ చైతన్య, శోభిత జంట వివాహం అయినప్పటి నుంచి పలు దేశాల్లో విహరిస్తూ తమ ప్రత్యేకమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటోంది. ఇటీవలే ఈ జంట ఆమ్‌స్టర్‌డామ్, మెక్సికోలో వీధి వీధి తిరుగుతూ సరదాగా ఎంజాయ్ చేసింది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నుండి సాయంత్రం వరకు తమ రోజు ఎలా గడిచిందో ఫోటోల ద్వారా తెలియజేశారు.

**రేసింగ్ ట్రాక్‌లో సందడి**

ఇటీవలే నాగ చైతన్య %–% శోభిత దంపతులు కార్ రేసింగ్ ట్రాక్‌లో సందడి చేశారు. చైతన్యకి రేసింగ్ అంటే చాలా ఇష్టం. అందుకే తన ఆనందాన్ని శోభితతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఆమెను కూడా ట్రాక్‌కు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి రేసింగ్ కార్లను నడిపి సరదాగా గడిపారు. అంతేకాదు, తనకు ఇష్టమైన రేసింగ్ కారులో శోభితను కూర్చోబెట్టి ఫోటోలు దిగారు. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.

**యూరప్ ట్రిప్ ఎంజాయ్ చేసిన జంట**

ఈ కొత్త కపుల్ ఇటీవలే యూరప్ టూర్‌కు వెళ్లి అక్కడ ఉన్న అందమైన ప్రదేశాలను ఆస్వాదించారు. ట్రిప్‌లో భాగంగా ప్రముఖ నగరాలను సందర్శిస్తూ ప్రత్యేకమైన క్షణాలను కెమెరాలో బంధించారు.

**హైదరాబాద్‌లో గ్రాండ్ వెడ్డింగ్**

గతేడాది డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో నాగ చైతన్య, శోభిత పెళ్లి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఇరువురి కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. పెళ్లి అనంతరం నాగ చైతన్య మాట్లాడుతూ, తన జీవితాన్ని శోభితతో పంచుకోవడం ఆనందంగా ఉందని, ఎప్పుడైనా కన్ఫ్యూజ్ అయితే ఆమె సలహా తీసుకుంటానని వెల్లడించాడు.
ఫ్యాన్స్ హర్షం

ఈ కొత్త జంటను చూసి అక్కినేని ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. "క్యూట్ కపుల్ ఎంజాయ్ చేయండి" అంటూ కామెంట్లు చేస్తున్నారు. వీరి ప్రేమకథను చూసి అభిమానులు మరింత ఉత్సాహంగా స్పందిస్తున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339